

కోడ్ కూసింది... 3వేల మంది విందుకు బ్రేక్

బెంగళూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు శాసనసభ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. మంగళవారం షెడ్యూల్ వెలువడ్డంతో ఎన్నికలు జరిగే రామనగర, హావేరి, బళ్ళారి జిల్లాలకు కోడ్ వర్తించింది. ఈమేరకు చెక్‌పోస్ట్‌లను పారరంభించారు. చన్నపట్టణ పరిధిలో 16 చెక్‌పోస్ట్‌లు ఏర్పాటయ్యాయి. ఇదే క్రియాశీలకమైన నియోజకవర్గం కావడంతో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. బీజేపీ నేత సీపీ యోగేశ్వర్ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. 3వేలమందికి మాంసాహార విందు ఏర్పాటు చేయగా ఎన్నికల అధికారులు దాడులు నిర్వహించి రద్దుచేశారు.

పారా ఒలింపిక్స్ విజేత నితీశ్‌కుమార్‌కు సత్కారం



నితీశ్‌కుమార్‌కు సన్మానం ఇలా...

బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పారా ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించిన నితీశ్‌కుమార్‌కు హెల్త్ చాంపియన్ పేరిట సత్కరించారు. నగరంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సన్మానం జరిగింది. ఆరోగ్య రంగంలో చైతన్యం కలిగించే హ్యాపియెస్ట్ హెల్త్ సంస్థ ముఖ్యులు అశోక్ సూతాతోపాటు సీఈఓ అనింద్యా చౌదరి తదితరులు సత్కరించారు. అశోక్‌సూతా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆరోగ్యవంతంగా జీవించేలా ప్రోత్సహించడమే హ్యాపియెస్ట్ హెల్త్ ఆశయమన్నారు. జీవనంలో ఎన్నో సమస్యలు ఎదురవుతాయని వాటిని అధిగమించిన సాధకులను హెల్త్ చాంపియన్‌గా పిలుస్తామన్నారు. నితీశ్‌కుమార్ మాట్లాడుతూ నిరంతర ఆరోగ్యం కోసం సైక్లింగ్, వాకింగ్, జాగింగ్‌లాంటివి చేయాలన్నారు. శారీరక దృఢత్వం కోసం ప్రతి ఒక్కరూ కొన్ని గంటలు కేటాయించాలన్నారు. తద్వారా ఆరోగ్యం, మానసిక ఉల్లాసం సాధ్యమన్నారు.

పంటలకు అపార నష్టం

- వర్షాలకు జనజీవనం అతలాకుతలం
- దెబ్బతిన్న రోడ్లు.. నిండిన చెరువులు



హంపి పురందరేశ్వర మఠం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నది

బళ్లారి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఎడతెరపి లేకుండా వానలు కురుస్తుండటంతో వేసిన పంటలు దెబ్బతిన్నాయి. మంగళ, బుధవారాలు కూడా వర్షం కురిసింది. సామన్యజనం బయటకు వెళ్లలేని పరిస్థితి. కొన్ని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, ఇతర వాణిజ్య దుకాణాల ముందు వర్షపు నీరు నిలబడంతో లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తుంగభద్ర జలశయానికి వరద నీరు ఉధృతంగా చేరడంతో గేట్ల ద్వారా నీటిని వదిలేశారు. సిరుగుప్ప, కంప్లి, గంగావతి, అనేగొంది తదితర నదిపరివాహక ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు నదినీరు ప్రవహించాయి. హంపీ వద్ద పురందరేశ్వర మఠం మునిగిపోయింది. నది అవతలి నుంచి ఇవతలివైపునకు రాకపోకలు నిలిపేశారు. గంగావతి, కొప్పళ, బళ్లారి ప్రాంతంలో చెరువులు నిండి ప్రవహిస్తున్నాయి. కొన్ని చోట్ల నీరు ఉధృతికి వంతెనలు కూలి రాకపోకలు స్తంభించాయి. రైతులు సాగు చేసిన ఉల్లి, ఇతర పంటలు దెబ్బతిన్నాయి.



కోలారు జిల్లా ముళబాగిలు ప్రాంతంలో ఎక్స్‌ప్రెస్ వే

వచ్చే ఏడాదికి... చెన్నై - బెంగళూరు ఎక్స్‌ప్రెస్ వే

- 288 కి.మీ.. రెండున్నర గంటల ప్రయాణం
- రూ.17,930 కోట్లతో నిర్మాణం

బెంగళూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల రాజధాని నగరాలు మధ్య వ్యాపార, వ్యవహారాలకు ప్రయాణాలను సరళీకృతం చేసేందుకు నిర్మిస్తున్న బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ వే వచ్చే ఏడాదికి అందుబాటులోకి రానుంది. రెండు నగరాల మధ్య 288 కి.మీ ఉండగా కేవలం రెండున్నర గంటలలోనే చేరుకునేలా ఆధునీకరించనున్నారు. బెంగళూరు - చెన్నైల మధ్య నిర్మిస్తున్న ఎక్స్‌ప్రెస్ వే ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలం కానుంది. ఎక్స్‌ప్రెస్‌వే కర్ణాటకలో 71 కిలో మీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 72 కిలోమీటర్లు, తమిళనాడులో 145 కిలోమీటర్లు ఏర్పాటు కానుంది. నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కర్ణాటక పరిధిలో 90శాతం పనులు పూర్తి కాగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలో 50శాతం జరిగాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. 62 కిలోమీటర్లు తగ్గడంతోపాటు ఇతరత్రా అంతరాయాలు లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడంతో కేవలం రెండున్నర గంటల్లోనే బెంగళూరు నుంచి చెన్నైకు చేరుకునే వెసలుబాటు ఉంది. భారతమాలా పరియోజన పథకం కింద రూ.17,930 కోట్ల ఖర్చుతో రోడ్డు నిర్మిస్తున్నారు.

- దక్షిణభారత్‌లోని రెండు ప్రముఖ నగరాలు బెంగళూరు, చెన్నైల మధ్య ఎక్స్‌ప్రెస్‌వే రహదారి గతంలో ఉన్న 350 కి.మీ నుంచి 288కి కుదించినట్టయ్యింది. వాహనాల గరిష్ఠవేగం 120 కి.మీ ప్రయాణించేలా రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నారు.
- బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్‌వేలో సర్వీస్‌రోడ్‌లు ఉండవు. సర్వీస్ రోడ్ల ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువని, వాటితో సంబంధం లేకుండా నిర్మాణాలు చేపట్టారు. తద్వారా ఇతర రహదారులతో పోలిస్తే ఈ ఎక్స్‌ప్రెస్‌వేలో టోల్ చార్జీ ఎక్కువగా ఉంటుంది. సుదూర ప్రయాణం సురక్షితం, వేగవంతంగా ఉండాలనే సర్వీస్‌రోడ్లను ఏర్పాటు చేయలేదు. ఈ ఎక్స్‌ప్రెస్ వేలో రాష్ట్రంలో మాలూరు, బంగారపేట, కోలార్ గోల్డ్‌ఫీల్డ్ (కేజీఎఫ్) ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పలమనేరు, వెంకటగిరికోట, చిత్తూరు, బంగారుపాలెం, తమిళనాడులో రాణిపేట, శ్రీపెరంబదూరు, చెన్నై నగరాలు ఉంటున్నాయి. ప్రతి పది కిలోమీటర్లకు కెమెరాలను అమరుస్తున్నారు. తద్వారా స్పీడ్ కంట్రోల్ నమోదుతోపాటు ప్రమాదాలను వేగవంతంగా గుర్తించే ప్రక్రియ అందుబాటులోకి రానుంది. రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారుల క్రాసింగ్‌లు, జిల్లా రోడ్లు ఉండే చోట 200-500 మీటర్ల దూరంలో అండర్‌పాస్, ఫ్లై ఓవర్‌లను ఏర్పాటు చేశారు.
- ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరుకు సులభతరంగా ప్రయాణించేందుకు ఎక్స్‌ప్రెస్‌వే అనుకూలం కానుంది. బెంగళూరు - చిత్తూరుల మధ్య నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగిస్తారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ప్రధానంగా వ్యాపార, వాణిజ్య వ్యవహారాలకు బెంగళూరు-చిత్తూరు మధ్య అధికంగా ఉంటుంది. చిత్తూరు జిల్లా ప్రజలు బెంగళూరులో వేలాదిమంది నివసిస్తున్నారు. వీరందరికీ ఎక్స్‌ప్రెస్‌వే అనుకూలం కానుంది. చిత్తూరు జిల్లాకు ఎక్స్‌ప్రెస్‌వే ద్వారా ఇటు బెంగళూరు, అటు చెన్నైకి వెళ్లేందుకు మరింత సులభతరం కానుంది.

నగరసభ కాంగ్రెస్ సభ్యులకు నోటీసు

- విప్ ఉల్లంఘించిన ఫిర్యాదుపై..



మీడియాతో నగరసభ సభ్యులు

శిడ్లఘట్ట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్షస్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో పార్టీ విప్‌ను ఉల్లంఘించి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారనే ఫిర్యాదుపై కాంగ్రెస్‌కు చెందిన ఏడుగురు సభ్యులకు జిల్లా అధికారి నోటీసు జారీ చేశారు. విచారణకు హాజరు కావాలని సూచించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవరెడ్డి, నగరసభ సభ్యుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సభ్యులు ఎస్‌ఎం మంజునాథ్, చిత్ర మనోహర్, అనిల్‌కుమార్, మంజునాథ్, కృష్ణమూర్తి, శివమ్మ మునిరాజు, జబివుల్లాలకు నోటీసులు జారీ అయ్యాయి. పార్టీ విచారణకు హాజరు కావాలని సూచించారు. సెప్టెంబరు 5న నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్షస్థానాలకు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్‌కు చెందిన 13మంది, జేడీఎస్‌కు చెందిన 10, బీజేపీకి చెందిన ఇద్దరు, నలుగురు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన సభ్యులకు విప్ జారీ చేసింది. ఎక్కువమంది కాంగ్రెస్ సభ్యులు ఉన్నా అధికారం దక్కించుకోవడంలో కాంగ్రెస్ విఫలమైంది. జేడీఎస్‌కు చెందిన వెంకటస్వామి, రూప నవీన్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కేఎన్ కేశవరెడ్డి, నగరసభ సభ్యుడు శ్రీనివాస్‌లు విప్ ఉల్లంఘించిన సభ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈనెల 30న జిల్లా అధికారి కోర్టులో జరిగే విచారణకు తప్పనిసరిగా హాజరు కావాలని నోటీసులో స్పష్టం చేశారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా బేషరతుగా జేడీఎస్ అభ్యర్థి వెంకటస్వామికి మద్దతు ఇచ్చామని నగరసభ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు అనిల్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమను ఎన్నుకున్న ప్రజలకు తాగునీరు, స్వచ్ఛత, వీధిదీపాలు వంటి కనీస సదుపాయాలు, వివిధ గ్రాంట్లకోసం ప్రామాణికంగా ప్రయత్నం చేశామన్నారు. తమ అవధి ముగుస్తోందని, నగరసభ ద్వారా అభివృద్ధికి సరైన గ్రాంట్లు లేక సొంతంగా ఖర్చు చేశామన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ, జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, డాల్ఫిన్ నాగరాజ్‌లకు పరిస్థితిని వివరించాకనే జేడీఎస్ అభ్యర్థికి మద్దతు ఇచ్చామన్నారు. అభివృద్ధి మినహా ఎలాంటి రాజకీయాలు లేవన్నారు. ఎన్నికలు గడిచిన నెలరోజుల తర్వాత ఇప్పుడు అభ్యంతరం వ్యక్తం చేయడం కేవలం రాజకీయ కుట్ర మినహా మరేం లేదన్నారు. ఇలాగే కొనసాగితే పార్టీ ముక్కలవడం ఖాయమన్నారు. మీడియా సమావేశంలో నగరసభ సభ్యులు ఎస్‌ఎం మంజునాథ్, చిత్ర మనోహర్, టీ మంజునాథ్, జబివుల్లా తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని సాయి లే అవుట్‌లో పరిస్థితి ఇలా..

వదలని వరుణుడు

- మెట్రో సంచారానికి అంతరాయం

బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావం రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. తీర ప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా బెంగళూరు శివారు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. ప్రత్యేకించి నగరంలో రెండోరోజు బుధవారం లక్షలాదిమందిని ఇబ్బంది కలిగించినట్టయ్యింది. సోమవారం రాత్రి ఆరంభమైన వాన మంగళవారం రాత్రి దాకా కొనసాగింది. ఒకటి రెండు గంటలపాటు విరామం ఇచ్చినట్టు అనిపించినా మరోసారి బుధవారం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. యలహంక పరిధిలోని కేంద్రీయ విహార అపార్ట్‌మెంట్‌లో ఇటీవలే వరద నీరు చేరి తీవ్ర సమస్య ఏర్పడిన విషయం తెలిసిందే. మరోసారి యలహంక చెరువుకు నీరు పోటెత్తడంతో కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్‌కు బుధవారం కూడా భారీగా నీరు వచ్చింది. కాలిఫోర్నియా లే అవుట్ పూర్తిగా జలమయమైంది. ప్రముఖ ఎంఎన్‌సీ, ఐటీ కంపెనీలు ఉండే మాన్యతాటెక్‌పార్క్ రోడ్డు నదులను తలపించాయి. ద్విచక్రవాహనాలలో వెళ్లే పరిస్థితి లేకపోవడం, కార్లు కూడా సగం మునిగిపోయేలా మారింది. రోడ్లపై ముందుకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోంను ప్రకటించారు. రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో సమస్య ఏర్పడింది. మాన్యతాటెక్ పార్క్ ప్రాంతం జలపాతంలా మారిందనే ట్రోల్స్ దేశ విదేశాలలో హల్‌చల్ చేశాయి. ఇదే ప్రాంతంలో భారీ భవన నిర్మాణాలకు సంబంధించి 30 అడుగుల మేర తవ్వకాలు జరిపిన చోట మట్టి కుంచించుకుపోయింది. చూస్తుండగానే ప్రహరీ కూలిపోయింది. కేఆర్‌పుర పరిధిలోని సాయి లే అవుట్ ప్రజల కష్టాలు మరింత అధికమయ్యాయి. నగరంలో వర్షం కురిస్తే చాలు లోతట్టు ప్రాంతమైన సాయి లే అవుట్‌కు నీరు చేరేది. మూడు రోజులుగా వాన కురుస్తుండడంతో ప్రజలు ఇళ్లలో ఉండలేక, బయటకు రాలేక ఇబ్బంది పడుతున్నారు. నగరంలో రెండోరోజు ట్రాఫిక్ తీవ్ర ఇబ్బంది కలిగించింది. 142 ఇళ్లలోకి నీరు చేరగా 39 చెట్లు నేలకూలాయి.

మెట్రో ట్రాక్‌పై విరిగిన చెట్టు: ఇందిరానగర్‌కు అనుబంధంగా ఉండే స్వామి వివేకానంద మెట్రోస్టేషన్ సమీపంలో చెట్టుకొమ్మలు ట్రాక్‌పై విరిగిపడ్డంతో మెట్రో సంచారానికి బ్రేక్ పెట్టారు. విద్యుత్ సరఫరాను పూర్తిగా ఆపేశారు. కొమ్మలు తొలగించే ప్రక్రియ చేపట్టారు. కొన్ని గంటల తర్వాత పునరుద్ధరించి మెట్రో సంచారం సాగింది.

పలు రైళ్లు రద్దు: రాష్ట్రంతోపాటు తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తుండడంతో నైరుతి రైల్వే పరిధిలో పలు రైళ్లను రద్దు చేశారు. చెన్నైలోని బేసిన్ బ్రిడ్జ్ జంక్షన్‌పై నీరు ప్రవహిస్తుండడంతో మైసూరు కేఎస్‌ఆర్, మాల్గుడి ఎక్స్‌ప్రెస్, మైసూరు ఎంజీఆర్ - చెన్నై సెంట్రల్, కావేరి ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు రైళ్ల సంచారాన్ని నిలిపివేశారు. అదే తరహాలోనే తీరప్రాంత జిల్లాలకు వెళ్లే రైళ్ల సమయంలోనూ వ్యత్యాసం ఉన్నట్టు ప్రకటించారు.



సాయి లే అవుట్‌లో నిలిచిన నీరు



మెట్రో ట్రాక్‌పై పడిన చెట్టుకొమ్మను తొలగిస్తున్న దృశ్యం

మరో అరకోటిమందికి కావేరి నీరు

- ఐదో విడత అంకితంలో సీఎం సిద్దరామయ్య



కావేరి ఐదో దశ పథకం ప్రారంభోత్సవంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్



బటన్ నొక్కి పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం

బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బోరుబావుల నీటిపైనే ఆధారపడి దశాబ్దాలకాలంగా ఇబ్బంది పడుతున్న అరకోటిమంది ప్రజలకు కావేరి నీటిని శాశ్వతంగా అందించడం సంతోషంగా ఉందని సీఎం సిద్దరామయ్య అన్నారు. మండ్య జిల్లా మలవళ్ళి తాలూకా తొరేకాడనహళ్ళిలో కావేరి ఐదో విడత పథకం శుద్ధీకరణ విభాగాన్ని బుధవారం సీఎం జాతికి అంకితం చేశారు. డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు జైకా ప్రతినిధులు పాల్గొన్నారు. సీఎం మాట్లాడుతూ కావేరి నాల్గో స్టేజ్ రెండో విడత పనులు పూర్తైన తర్వాత బెంగళూరు పాలికె పరిధిలో విలీనమైన 110 గ్రామాలకు నీటి సరఫరా క్లిష్టమైందన్నారు. గతంలో తాను సీఎంగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టును ప్రకటించామని, అందుకు అనుగుణంగానే సాకారం చేశామన్నారు. 110 గ్రామాలకు 2,200 ఎంఎల్‌డీల నీరు అవసరం ఉందన్నారు. ప్రస్తుతం 1400 ఎంఎల్‌డీ నీరు లభ్యమవుతోందన్నారు. ఇందుకోసమే నగరాభివృద్ధిశాఖ బెంగళూరు నగరానికి అదనంగా 10 టీఎంసీల నీటిని మంజూరు చేసిందన్నారు. ఐదో విడత పనులు జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ (జైకా) ఆర్థిక సహకారంతో 2014లో ప్రారంభించామన్నారు. 4,336 కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. జైకా 84శాతం సాయం చేయగా మిగిలిన 16శాతం జలమండలి ద్వారా సమకూర్చామన్నారు. ఐదో విడత ద్వారా యశ్వంతపుర, బెంగళూరు దక్షిణ, బ్యాటరాయనపుర, టి దాసరహళ్ళి, మహదేవపుర, యలహంక, రాజరాజేశ్వరినగర్, బొమ్మనహళ్ళి పరిధిలోని వివిధ ప్రాంతాలతోపాటు బెంగళూరులో విస్తరిస్తున్న ప్రదేశాలకు కావేరి నీరు సమకూరుతుందన్నారు. జలమండలి ద్వారా నగరంలో 10.64 లక్షల నివాసాలకు నీరు అందిస్తున్నామని ప్రస్తుతం, మరో 4 లక్షల కొత్త కనెక్షన్‌లు అనుసంధానం అవుతాయన్నారు. గతంలో నగరానికి 1.58 టీఎంసీల నీరు నెలకు సమకూర్చేవారమని ప్రస్తుతం 2.4 టీఎంసీల నీరు అవసరం కానుందన్నారు. కుమారస్వామి కేంద్రమంత్రిగా ఉన్నా ఆరోపణలు చేయడమే గానీ ఆచరించరని మండిపడ్డారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పనులు జాప్యమయ్యాయన్నారు. ప్రస్తుతం కేంద్రమంత్రిగా ఉన్న కుమారస్వామి మేకెదాటు ప్రాజెక్టుకు ఎందుకు అనుమతులు ఇప్పించలేకపోతున్నారని ప్రశ్నించారు. బెంగళూరు దేశంలోనే అభివృద్ధి చెందుతున్న నగరమని, ఏటా కేంద్రానికి పన్నుల రూపంలో 4 లక్షల కోట్లు చెల్లిస్తుండగా వాపసు వస్తున్నది 60వేల కోట్లు మాత్రమే అన్నారు. ఈ వ్యత్యాసంపై రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్రమంత్రులు, ఎంపీలు నోరు తెరవరన్నారు.

కార్యక్రమానికి ఎమ్మెల్యే నరేంద్రస్వామి అధ్యక్షత వహించగా మంత్రులు చలువరాయస్వామి, కేజే జార్జ్, ఎమ్మెల్యేలు ఎస్‌టీ సోమశేఖర్, బైరతి బసవరాజ్, ఎస్‌ఆర్ విశ్వనాథ్, టీఎం నాగరాజ్, రవి, దినేశ్ గూళిగౌడ, సుధామదాస్, మాదేగౌడ, నాగరాజ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విమర్శించేవారిని పట్టించుకోం - డీసీఎం

విమర్శించేవారి గురించి పట్టించుకునేది లేదని మేం చేపట్టే అభివృద్ధే వారికి సమాధానమని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. కావేరి ఐదో విడత పనులు ఇప్పటికే పూర్తి కావాల్సి ఉండేదన్నారు. పలు కారణాలతో జాప్యం జరిగిందన్నారు. కర్ణాటక జనాభాలో నాలుగింట ఒకభాగం 1.5 కోట్లమందికి నీటిని సమకూర్చే మహత్తరమైన పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గతంలో ఎత్తిపోతల పథకం అసాధ్యమని ఆరోపించారని, కానీ అమలు చేశామన్నారు. తుంగభద్ర ప్రాజెక్టు 19వ క్రస్ట్‌గేట్ మరమ్మతులు అసాధ్యమని ఎందరో మాట్లాడారని, కానీ రోజుల వ్యవధిలోనే సాధ్యమైందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కావేరి నీరు తమిళనాడుకు ఏడాదికి 132 టీఎంసీలు విడుదల చేయాలని, నిరంతర వర్షాలతో ఏకంగా 213 టీఎంసీల నీరు విడుదల చేశామన్నారు. మేకెదాటు ప్రాజెక్టు నిర్మిస్తే బెంగళూరుకు శాశ్వతంగా తాగునీరు సాధ్యం కానుందని తమిళనాడుకు మరింత అనుకూలమన్నారు. ప్రతి మనిషి మార్పుకోసం పోరాటం చేయాలని, జీవిస్తే నాయకుడని, మరణిస్తే చరిత్రగా మిగలాలని అంబేడ్కర్ మార్గదర్శకాలకు అనుగుణంగానే పనిచేస్తున్నామని అన్నారు.



భక్తజన సందోహం మధ్య రథోత్సవం

వైభవంగా చాముండేశ్వరి రథోత్సవం

- పోటెత్తిన భక్తులు
- ఉత్సవాలకు దూరంగా రాజ కుటుంబం



చాముండేశ్వరి అమ్మవారు

బెంగళూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నాడదేవత చాముండేశ్వరిదేవి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. దసరా ఉత్సవాలు ముగిసిన తర్వాత సంప్రదాయబద్ధంగా అమ్మవారి రథోత్సవం జరపడం ఆనవాయితీగా వస్తోంది. బుధవారం తెల్లవారుజామునుంచే చాముండేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఉదయం 9.15 గంటలకు ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. ఆలయం చుట్టూ రథోత్సవం సాగింది. రథోత్సవాన్ని ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ పూజలు చేసి ప్రారంభించారు. మైసూరుతోపాటు వివిధ ప్రాంతాలనుంచి వేలాదిమంది భక్తులు తరలిరావడంతో చాముండికొండలు పోటెత్తినట్టయ్యింది. సాధారణంగా రథోత్సవాన్ని రాజకుటుంబం పూజలు చేసి ప్రారంభించేది. యువరాజు యదువీర్‌కు రెండో కుమారుడు జన్మించడంతో రాజకుటుంబం సంప్రదాయం ప్రకారం కొన్ని రోజులు దూరంగా ఉండాలని నిర్ణయించారు. చాముండేశ్వరిని కొలుస్తూ రథంపై అరటిపండ్లు వేసి మొక్కులు తీర్చుకున్నారు.

న్యూస్ బాక్స్

మళ్లీ ఆయనే..

అనంతపురం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశుగణాభి వృది సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈఓ)గా సుధాకర్‌ను కొనసాగిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పశుసంవర్ధక శాఖ డీడీ సుధాకర్ ప్రస్తుతం పశుగణాభి వృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. మరో ఏడాదిపాటు ఆయన్ను ఆ సంస్థలో ఈఓగా కొనసాగిస్తూ పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జిల్లాకు డీఏపీ సరఫరా

అనంతపురం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1340 మెట్రిక్ టన్నుల డీఏపీ సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇందులో 50 శాతం డీఏపీని మార్క్‌ఫెడ్‌కు కేటాయించినట్లు తెలిపారు.

ఇళ్ల మధ్యలో మద్యం దుకాణాలు వద్దు: ఐద్వా

అనంతపురం కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు నివసించే చోట మద్యం దుకాణాలు పెట్టవద్దు అని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి బుధవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే మద్యాన్ని నియంత్రించాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం ఖాతరు చేయకుండా విచ్చలవిడిగా మద్యం షాపులు పెడుతోందని విమర్శించారు. రాత్రి 10 గంటల వరకు దుకాణాలు తెరిచి ఉంచితే మహిళలు ఇబ్బంది పడతారని, దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. ఇప్పటికైనా గుడి, బడి, మహిళలు ఇబ్బంది పడే ప్రాంతాల్లో మద్యం షాపులు పెట్టకుండా ఎక్సైజ్ శాఖ కమిషనర్, సూపరింటెండెంట్‌లు చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనసాగిన పప్పుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పప్పుశనగ పంపిణీ ప్రక్రియ బుధవారం రెండో రోజు కొనసాగింది. ఇప్పటి దాకా 11890 క్వింటాళ్ల పప్పుశనగ పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటి దాకా 13561 మంది రైతులు 19059 క్వింటాళ్ల పప్పుశనగ కోసం తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుకున్నారు.

50కిలోలు ఇవ్వాలి: రైతు సంఘం

అనంతపురం కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎకరాకు 50 కిలోల చొప్పున రైతులకు పప్పుశనగ అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి సంయుక్త ప్రకటనలో బుధవారం డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎకరాకు 40కిలోలు ఇస్తామని ప్రకటించిందని, అయితే కొన్ని గ్రామాల్లో రైతుసేవా కేంద్రం అధికారులు ఎకరాకు 20కిలోలు మాత్రమే ఇస్తూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నార న్నారు. అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2023 రబీలో అతివృష్టి, అనావృష్టి కారణంగా సాగుచేసిన పంటలు పూర్తిగా నష్టపోవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోయారన్నారు. కాబట్టి రైతులకు ఎకరాకు 50కిలోల పప్పుశనగ అందజేయాలని కోరారు.

నర్సుల సంఘం ఎన్నికలకు 21 నామినేషన్లు

అనంతపురం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నర్సుల జిల్లా అసోసియేషన్ ఎన్నికలకు బుధవారం ఐఎంఏ హాల్‌లో నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. ఎన్నికల అధికారి చంద్రశేఖర్ బరిలో ఉన్న అ భ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. మొత్తం 21 నామినేషన్లు వచ్చాయి. ఇందు లో అధ్యక్ష స్థానానికి 03, వైస్‌ప్రెసిడెంట్‌కు 04, జిల్లా కార్యదర్శికి 03, కోశాధికారి పో స్టుకు04, ఎగ్జిక్యూటివ్ మెంబర్ స్థానానికి 07 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. నామినేషన్ల పరిశీలన గురువారం, ఉపసంహరణ శుక్రవారం, 23న ఎ న్నికలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

నాణేలపై అవగాహన అవసరం - ఎల్‌డీఎం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నాణేలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని ఎల్‌డీఎం నర్సింగరావు తెలిపారు. రూ.10, ఇతర నాణేలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు బుధవారం ఎల్‌డీఎం, కె నరాబ్యాంకు ఆధ్వర్యంలో నగరంలోని హోటళ్ల, బ్యాంకులు, తోపుడుబండ్లు, వ్యా పార సముదాయాల్లో అవగాహన కల్పించారు. రూ.10నాణేలపై అపోహలు సరికాదని, ఎక్కడైనా వినియోగించవచ్చని తెలిపారు. అనంతరం పలువురు వ్యాపారులకు నాణేలను పంపిణీ చేశారు. ఈ కా ర్యక్రమంలో కెనరాబ్యాంకు డివిజనల్ మేనేజర్లు షేక్ మహబూబ్, సెంథిల్‌కుమార్, మేనేజర్ దివ్య, గోపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీడిపల్లికి 1047 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయరుకు 1047 క్యూసెక్కుల వరద వస్తోందని హంద్రీనీవా అధికారులు బుధవారం తెలిపారు. హంద్రీ నీవా ఫేజ్-2కు 955 క్యూసెక్కులు వదులుతున్నామని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.642 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రూ. 2.5 కోట్లు చిన్న కథ కాదు

- లేనివి ఉన్నట్లు, వేయనివి వేసినట్లు..
- డీసీఈబీలో దృశ్యం సినిమా సీన్లు
- అక్రమ పద్ధతుల్లో ఫేక్ టెండర్ల డ్రామా
- రూ.2.5 కోట్ల ప్రశ్నపత్రాల పనుల్లో అక్రమాలు

జిల్లా సాధారణ పరీక్షల మండలిలో లేనివి ఉన్నట్లు, వేయని టెండర్లు వేసినట్లు సినిమాటిక్‌గా కథను నడిపారు. ఆఖరికి రబ్బర్ స్టాంపులు కూడా సృష్టించి కథ నడిపి రూ. 2.5 కోట్ల పనుల్లో భారీగా అక్రమాలకు పాల్పడ్డారు. ఈ ఎపిసోడ్‌లో పాత్రధారి, సూత్రధారి మొత్తం కథ నడిపితే వ్యవహారం మొత్తం తెలిసినా కమీషన్లు తీసుకుని మరో ఉన్నతాధికారి కూడా కళ్లు మూసుకున్నట్లు విమర్శలు వస్తున్నాయి. మొత్తంపై డీసీఈబీ స్కామ్‌లో తవ్వే కొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి.

- అనంతపురం విద్య(ఆంధ్రజ్యోతి)



డీసీఈబీ కార్యాలయం

టెండర్లు పిలవకుండానే పేపర్లు సరఫరా

2024-2025 విద్యా ఏడాదికి సంబంధించిన ప్రశ్నాపత్రాల సరఫరా, ఇతర పనుల నిమిత్తం ఇటీవల టెండర్లు పిలిచారు. గత నెల చివరల్లో టెండర్ నోటీసులు ఇస్తూ.... పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. ఎక్కడైనా టెండర్లు ఓపెన్ చేసి న తర్వాత అర్హులను గుర్తించడం, తర్వాత టెండర్ దక్కించుకున్న వారితో అగ్రిమెంట్ చేసుకుంటారు. అగ్రిమెంట్ చేసుకున్న వాళ్ల పనులు చేస్తారు. ఈ ప్రొసీజర్ కామన్. అయితే సెప్టెంబరులో టెండరు కోసం ప్రకటనలు ఇచ్చారు. అయితే 2024-25విద్యా ఏడాదికి సంబంధించిన పనులు ఆగస్టులోనే ప్రారంభించారు. ఈ విద్యా ఏడాదికి సంబంధించిన ఎఫ్ఏ-1 ప్రశ్నాపత్రాలను ముద్రించి, సప్లై చేశారు. ఈ వర్కును అడ్డగోలుగా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నా యి. నిబంధనలకు విరుద్ధంగా గుట్టుగా ఈ టెండర్ తంతు సాగించినట్లు విమర్శలు వస్తున్నాయి.

అంతా దృశ్యమే!

డీసీఈబీలో 2024-25 విద్యా ఏడాది ఎఫ్ఏ-1,2,3,4, ఎస్ఏ-1, 2, ప్రశ్నాపత్రాలు ముద్రణ, సరఫరా, జవాబు పత్రాల స్కానింగ్ ఇతర పనులకు సంబంధించి రూ. 2.5 కోట్ల పనుల వెనుక భారీగా కథ నడిపినట్లు తెలుస్తోంది. ఈ పనులను విజయవాడ ప్రాంతానికి చెందిన కొన్ని ప్రింటర్స్‌కు అప్పగించడానికి జూన్, జూలై మాసాల్లోనే దృశ్యం సినిమా తరహాలో ఫేక్ ఎపిసోడ్స్ సాగించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. టెండర్ పిలిచినట్లు న్యూస్ పేపర్లలో ప్రకటనలు ఇవ్వడం, అవి ప్రింటర్స్ యజమానులు చూసి, టెండర్లు వేయడం, వాటిని ఓకే చేయడం, తర్వాత అగ్రిమెంట్ కుదుర్చుకోవడం తదితర పనులన్నీ నకిలీ డాక్యుమెంట్ల ద్వారా సాగించారన్న విమర్శలు వస్తున్నాయి. రబ్బర్ స్టాంపులు కూడా ఫేక్‌వి సృష్టించారన్న ఆరోపణలు వ స్తున్నాయి. తమకు అనుకూలమైన ముద్రణాలయాలకు గంపగుత్తగా పనులు కట్టబెట్టి, భారీగా గుడ్‌విల్ సొమ్ము లాగేసుకోడానికే ఈ తంతు సాగించినట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారం వెనుక ఇద్దరు ఉన్నతాధికారులున్నట్లు తెలుస్తోంది.

టీచర్లయితే వెంటనే చర్యలు... మరి డీసీఈబీ వ్యవహారం కనిపించదా..?

జిల్లా విద్యాశాఖ పరిధిలో పనిచేసే టీచర్లు చిన్న తప్పు చేసినా వెంటనే ఎలాంటి విచారణ చేయకుండా చర్యలు తీసుకుంటారు. సాయంత్రానికి సస్పెండ్ చేస్తారు. లేదా చార్జెస్ ఫ్రేం చేయడం వంటి చర్యలకు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారి దిగుతున్నారు. మరి డీసీఈబీలో భారీగా నిధుల గోల్ మాల్ జరిగినా చర్యలు తీసుకోకపోవడంపై ఉపాధ్యా య సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పెదవి విరుస్తున్నారు. డీఈఓ ఫిబ్రవరిలో వస్తే...డిసెంబరులోనే ఆమె పేరుతో రూ. 31.80 లక్షల విలువైన పనులకు సంబంధించి న వర్క్ ఆర్డర్ నకిలీ ఉత్తర్వులు సృష్టించినా చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండటంపై ఆరోపణలు వస్తున్నాయి.

విద్యాశాఖ అక్రమాలపై విచారణ చేయాలి



టీచర్ల విషయంలో ఏదైనా వివాదం ఏర్పడితే కనీసం విచారణ కూడా చేయకుండా పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సస్పెండ్ చేస్తారు. మూడు నెలల తర్వాత తీరిగ్గా విచారణ చేస్తారు. విషయం ఏమీ లేకపోతే అబ్బే ఏం లేదంటూ సస్పెన్షన్ ఎత్తివేస్తారు. అయితే మూడు, నాలుగు నెలలు మాత్రం టీచర్లను బాధపెడుతారు. అదే డీసీఈబీలో అక్రమాలు జరిగితే, డీఈఓ కింద పనిచేసే డీవైఈఓను విచారణాధికారిగా వేస్తే విచారణ ఎలా పారదర్శకంగా జరుగుతుంది. టీచర్లకు ఒక న్యాయం అధికారులకు ఒక న్యాయమా..?, అధికారులకు సీసీఏ రూల్స్ వర్తించవా? ఇదెక్కడి విడ్డూరం...? టీచర్ల రీప్పొర్టియేషన్‌లో కూడా చాలా అక్రమాలు జరిగాయి. డీఈఓను పక్కనబెట్టి విద్యాశాఖలో జరిగే అక్రమాలపై విచారణ చేయాలి.

- హరికృష్ణ, పోర్టో రాష్ట్ర చైర్మన్

డీఈఓపై విచారణ చేయాలి



జిల్లా విద్యాశాఖలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించే డీసీఈబీ అత్యంత కీలకమైనది. ఇందులో భారీగా నిధుల స్కాం జరిగినట్లు తేటతెల్లమవుతోంది. ఇన్ని అక్రమాలు జరిగినా ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారో వారికే తెలియాలి. అనంతపురం డీసీఈబీలో జరిగిన అక్రమాలపై విద్యాశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ, విద్యాశాఖ మంత్రి స్పందించాలి. డీఈఓపై కూడా విచారణ చేసి, చర్యలు తీసుకోవాలి.

- అశోక్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్ఆర్‌టీఏ

చుక్కలు కనబడుతున్నాయ్..!

- ఫ్రీహోల్డ్ భూముల పునఃపరిశీలన
- వైసీపీ పాలనలో అక్రమాలపై యంత్రాంగం ఆరా
- 22-ఏ, చుక్కల భూముల వివరాలు కోరిన సీసీఎల్ఏ
- వణుకుతున్న రెవెన్యూ అక్రమార్కులు

కళ్యాణదుర్గం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): భూముల విషయంలో జరిగిన అక్రమాలపై కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించడంతో అక్రమార్కుల గుండెల్లో దడ పుడుతోంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ అయిన ఫ్రీహోల్డ్ భూములే కాకుండా నిషేధిత జాబితా నుంచి తొలగించిన దానిపై పునఃపరిశీలన సాగుతోంది. ఈ నేపథ్యంలోనే కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్‌లో 3203 మందికి చెందిన 12,393 ఎకరాలను 22ఏ నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వైసీపీ పాలనలో జరిగిన భూ అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ఐదేళ్లుగా ఎన్ని ఎకరాల ప్రభుత్వ భూములకు పట్టాలిచ్చారు. చుక్కల భూములు ఎన్ని ఎకరాలు చక్కబెట్టారు. నిషేధిత జాబితా నుంచి ఎంత తొలగించారనే వివరాలను ఆరా తీసే పనిలో నిమగ్నమైంది.

అధికారులు, నాయకుల వాటాలు

అప్పట్లో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, కళ్యాణదుర్గంలో పనిచేసిన తహసీల్దార్లు, అధికార పార్టీ నాయకులు ప్రైవేటు వ్యక్తుల పేరిట పట్టాలు రాయించుకున్నారనే విమర్శలున్నాయి. ఇళ్ల పట్టాలను అక్రమమార్గంలో కొట్టేసి వాటిని విక్రయించి, వాటాలుగా పంచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఐదేళ్లలో చాలానే జరిగాయి. అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్ కనుసన్నల్లో 22ఏ జాబితాపై ప్రత్యేక దృష్టి సారించి, అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ చేయించారన్న విమర్శలు కూడా వినిపించాయి. అడిగినంత డబ్బు ఇస్తే ఎటువంటి ఆధారాలు లేకున్నా వాటిని ఆ జాబితా నుంచి తొలగించారు. కొందరు నేతలు సెటిల్‌మెంట్ భూములను 22ఏలోకి చేర్పించి భూ యజమానులను ముప్పతిప్పలు పెట్టి ముక్కుపిండి డబ్బు వసూలు చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. చుక్కల భూముల సమస్యలు పరిష్కరించేందుకు భారీగా డబ్బు తీసుకున్నారన్న ఆరోపణలు కూడా గుప్పుమంటున్నాయి.



కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయం

ఆరా తీస్తున్న ప్రభుత్వం

సీసీఎల్ఏ అధికారులు ప్రధానంగా 22ఏ, చుక్కల భూముల నుంచి ఎన్ని ఎకరాలు తొలగించారు. ప్రభుత్వ, డీకేటీ భూముల్లో ఎన్ని ఎకరాలకు పట్టాలు ఇచ్చారు. ఫ్రీహోల్డ్‌గా ఎంత చేశారు. మాజీ సైనికులకు ఎంత భూమి ఇచ్చారన్న వివరాలపై ప్రభుత్వం ఆరా తీసే పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది. వీటితో పాటు వ్యవసాయేతర భూమిగా ఎంత మార్చారనేది ప్రతి మండలం నుంచి నివేదిక కోరుతున్నట్లు తెలిసింది. ఇలా 2019 నుంచి 2024 జూలై 23 వరకు ఉన్న వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూమిలో జగనన్న కాలనీలకు ఎంత ఇచ్చారు. ఇతర అవసరాలకు ఎంత కేటాయించారో కూడా స్పష్టం చేయాలన్న వివరాలను కూడా ప్రభుత్వ యంత్రాంగం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ముఖ్యంగా చుక్కల భూమి వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది.

వెలుగులోకి అప్పటి మంత్రి దందా!

చుక్కల భూముల వ్యవహారంలో అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్ మొత్తం దందా సాగించినట్లు విమర్శలున్నాయి. ఆమె చెప్పినదానికి తల ఆడించే తహసీల్దార్లను నియోజకవర్గంలో నియమించుకుని అక్రమాలకు పాల్పడ్డారు. అధికారులను గుప్పిట్లో పెట్టుకుని వేల ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయించి, లక్షలాది రూపాయలు దండుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో చుక్కల భూముల దందాపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిసింది. అవన్నీ ఇప్పుడు బయటకు వచ్చే అవకాశం ఉంది. దీంతో గత ఐదేళ్ల భూదోపిడీ కూడా బహిర్గతమయ్యే అవకాశం వుంది.

డబ్బులిస్తే చాలు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. చుక్కల భూములను కూడా దర్జాగా డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పటి మంత్రి ఉష శ్రీచరణ్ కనుసన్నల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమంతా పనిచేసింది. అప్పటి ఒక సబ్ రిజిస్ట్రార్ ఆమెకు తొత్తుగా మారి, చుక్కల భూములు కూడా రిజిస్ట్రేషన్ చేయించారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతి రోజు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వచ్చిన అక్రమ ఆదాయాన్ని వాటాలుగా పంచుకున్నట్లు తెలిసింది. ఈ విషయాలన్నింటిపై కూటమి ప్రభుత్వం ఆరా తీస్తుండటంతో అప్పటి అక్రమాల్లో పాలు పంచుకున్న సూత్రధారులు, పాత్రధారుల్లో ఆందోళన మొదలైంది.

హంద్రీనీవాను డబుల్ చేయండి

మంత్రికి సీపీఐ రామకృష్ణ వినతి

అనంతపురం విద్య, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువను రెండింతలు చేసి పూర్తిస్థాయిలో నీరు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నీటిపారుదల శాఖ మంత్రిని కోరారు. అమరావతిలో నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని బుధవారం ఆయన కలిసి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ తుంగభద్ర డ్యాంలో సమృద్ధిగా నీళ్లు ఉన్నాయన్నారు. డ్యాం నుంచి జిల్లా వాటాగా 32 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, కేవలం 13 టీఎంసీలు మాత్రమే అందుతున్నాయ న్నారు. తుంగభద్ర డ్యాం అధికారులు నీళ్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ హెచ్చెల్సీ లైనింగ్ పనులు పూర్తికాకపోవడంతో జిల్లా ప్రజలు ఆశించి నా...నీరు అందే పరిస్థితి లేదన్నారు. 4 వేల క్యూసెక్కుల నీరు హెచ్చెల్సీ ద్వారా సరఫరా చేసేందులు అధికారులు సిద్ధంగా ఉన్నా కాలువ లైనింగ్ పూర్తికాకపోవడంతో 1800 క్యూసెక్కులు మాత్రమే ప్రవహిస్తున్నాయన్నారు. ప్రభుత్వం బడ్జెట్‌లో పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి, కాలువ లైనింగ్ పనులు పూర్తి చేసి, నీటిని విడుదల చేయాలన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండలా ఉన్నా రాయలసీమ జిల్లాలకు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా పూర్తిస్థాయిలో నీళ్లు అందడం లేదన్నారు. ప్రభుత్వం హెచ్ఎన్ఎస్ఎస్‌ను రెండింతలు చేసి నీరు అందించాలని కోరారు.



నీటిపారుదలశాఖ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రామకృష్ణ

అభివృద్ధి దిశగా అడుగులు

- పంచాయతీలకు పూర్వవైభవం!
- 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయింపునకు రంగం సిద్ధం
- ఏ పనులు చేపట్టాలన్న విషయంగా విధివిధానాలు ఖరారు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 16: గ్రామ పంచాయతీల అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పంచాయతీల వారిగా స్థితిగతులను సేకరించి అభివృద్ధి పనులు చేపట్టడానికి శ్రీకారం చుట్టింది. గత వైసీపీ పాలనలో కేంద్ర ఇచ్చిన నిధులు సైతం పంచాయతీలకు దక్కేవి కాదు. దీంతో పల్లె పాలకులు(సర్పంచ్‌లు) అభివృద్ధి విషయంగా ప్రజల మధ్యలో తలెత్తుకోలేని పరిస్థితి ఉండేది. ఈ విషయంలో వైసీపీ సానుభూతిపరులైన సర్పంచ్‌లు కూడా నానా ఇబ్బందులు పడ్డారు. అయితే కూటమి పార్టీలు అధికార పీఠంపై కొలువుదీరిన తర్వాత ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు తీసుకున్న డిప్యూటీ సీఎం గ్రామీణ సమస్యలపై దృష్టి సారించారు. ఈక్రమంలోనే సంబంధిత అధికారులతో తరచూ సమీక్షలు నిర్వహించి పల్లె స్థితిగతులు తెలుసుకున్నారు. దీంతో గ్రామాలు అభివృద్ధి బాట పడతాయని పల్లె పాలకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈక్రమంలోనే కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులు జిల్లాల వారిగా విడుదలకు శ్రీకారం చుట్టడంతో సర్పంచ్‌ల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోగా, కేంద్రం కేటాయించిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8629 కోట్లు కూడా ఇతర పథకాలకు మళ్లించింది. దీంతో గ్రామాల్లో కనీసం వీధిలైట్లు కూడా వేయించలేని పరిస్థితి ఉందని సర్పంచ్‌లు వాపోయేవారు. ఉమ్మడి జిల్లాలో 1044 పంచాయతీలు ఉంటే ఇందులో 15 శాతం మాత్రమే టీడీపీ మద్దతుదారులున్నారు. మిగిలినవారంతా వైసీపీ సానుభూతిపరులే. అయినా వారు కూడా నిధులు లేక, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక నీరసించిపోయారు.

ప్రజాభిప్రాయం మేరకు అభివృద్ధి పనులు

కూటమి ప్రభుత్వం కొలువు తీరిన వంద రోజుల్లోనే పల్లె పాలకులు, ప్రజలు గత ఐదేళ్లలో అనుభవించిన కష్టాలను తరిమికొట్టేలా అభివృద్ధి పనులకు ప్రణాళికలు తయారు చేశారు. పంచాయతీల్లో ఎక్కడ, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్న విషయంలో ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఆమేరకు సంబంధిత శాఖలు సంయుక్తంగా ఏ ఏ శాఖల నుంచి ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నది నిర్ణయించారు. ఒక శాఖ నుంచి చేసే అభివృద్ధి పని మరో శాఖ నుంచి చేపట్టడానికి వీలు లేకుండా చేశారు. స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి, మంచి జరిగేలా తగిన చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించి జిల్లా స్థాయి అధికారులు, మండల, పంచాయతీ అధికారులతో సమీక్షలు నిర్వహించి దిశనిర్దేశం చేశారు.

ఏర్పాట్లు పూర్తి

- నేడు జిల్లాలో రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి
- హాజరుకానున్న జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు



పాతూరులోని వాల్మీకి విగ్రహం వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్, బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జున తదితరులు

అనంతపురం అర్బన్/అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు16: రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి వేడుకలు జిల్లాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలకు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. పాతూరులోని పవర్ ఆఫీసు వద్దనున్న వాల్మీకి విగ్రహానికి గురువారం ఉదయం 10 గంటలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం గుత్తిరోడ్డులోని మార్కెట్ యార్డు వద్దనున్న బళ్లా కన్వెన్షన్ హాల్‌లో జయంతి వేడుకలు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించనున్నారు.

ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్ వినోద్‌కుమార్

జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జునతో కలిసి ఆయన పాతూరులోని వాల్మీకి విగ్రహం ప్రాంతం, బళ్లా కన్వెన్షన్ హాల్‌ను పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా వేడుకలు జరగాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన వెంట బీసీ సంక్షేమశాఖ జేడీ ఉమాదేవి, డీడీ కుష్బూకొఠారీ, డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, తహసీల్దార్ హరికుమార్, జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

జయప్రదం చేద్దాం : అంబికా లక్ష్మీనారాయణ, ఎంపీ

వాల్మీకి జయంతి వేడుకలను జయప్రదం చేద్దామని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నగరంలోని గుత్తి రోడ్డు బళ్లా కన్వెన్షన్ హాల్‌లో గు రువారం ఉదయం 10 గంటలకు వాల్మీకి జయంతి నిర్వహిస్తామన్నారు. తొలుత పాతూరు పవర్ ఆఫీస్ వద్ద వాల్మీకి వి గ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పిస్తామని తెలిపా రు. వేడుకల్లో వాల్మీకి నాయకులు, ప్రజాప్రతినిధులు, వాల్మీకి బంధుమిత్రులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వారంలో రెండు రోజులు

- పింఛన్ల మెడికల్ సర్టిఫికెట్ల మంజూరుకు కేటాయింపు
- జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు



అనంతపురం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు అర్హత ఉండి, మెడికల్ సర్టిఫికెట్లు అవసరమైన వారి కోసం వారంలో రెండు రోజులు కేటాయించినట్లు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు తలసేమియా, సికిల్‌సెల్ అనీమియా, హిమోఫిలియా, బోధకాలు, పక్షవాతం, ప్రమాదాలలో వీల్‌చైర్‌లకే పరిమితమైనవారు, డయాలసిస్, కిడ్నీ తొలగించుకున్నవారు, కుష్ఠువ్యాధి, గుండె, లివర్, కిడ్నీ మార్పిడి చేసుకున్నవారు మెడికల్‌బోర్డు సర్టిఫికెట్ దరకాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. వీరికి ప్రతి మంగళవారం, శుక్రవారం సర్టిఫికెట్ పొందే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆ రోజుల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆస్పత్రిలో సంబంధిత విభాగాల డాక్టర్లను సంప్రదించవచ్చన్నారు. ఈనిబంధనలు ఈనెల 22 తర్వాత నుంచి అమలులోకి వస్తాయన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయిజిల్లాలకు చెందిన వారు ఈ విషయాన్ని గమనించి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతులపై వీఆర్వో చిందులు

కొత్తచెరువు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులపై మండలంలోని కొడపగానిపల్లి వీఆర్వో కాటమయ్య చిందులు తొక్కాడు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోనే రెచ్చిపోయాడు. తహసీల్దార్ ఎదుటే ఆగ్రహం వ్యక్తం చేశాడు. కొడపగానిపల్లికి చెందిన బాధిత రైతులు నవీన్, రామాంజి, సుబ్బరాయుడు, శివ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీఆర్వో కాటమయ్య నేటికీ వైసీపీ సేవలోనే తరిస్తున్నాడని ఆరోపించారు. ఆ పార్టీ నాయకులు చెప్పిన వారికే ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారని మండిపడ్డారు. వీఆర్వో నిబంధనలకు విరుద్ధంగా 2010, 2015, 2023లో పట్టాలు పొందిన రైతులకు బోగస్ రికార్డులు సృష్టించి, ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనల మేరకు తమ భూములకు ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ చేయాలని వేడుకున్నా వినలేదని వాపోయారు. వైసీపీ నాయకుల ద్వారా ఫోన్ చేయిస్తే చేస్తానని ఖరాకండిగా చెప్పాడు. రైతు నవీన్ ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ చేయాలంటూ వీఆర్వో కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు. రూ.50వేలు ఇస్తేనే చేస్తానన్నాడు. ఆ మొత్తం తనొక్కడికే కాదనీ, పైఅధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని వీఆర్వో తెలిపాడు. దీంతో రైతులు బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి మూకుమ్మడిగా ఫిర్యాదు చేశారు. అక్కడికి వచ్చిన వీఆర్వో కాటమయ్య.. తహసీల్దార్ నీలకంఠారెడ్డి రైతులతో మాట్లాడుతుండగా.. వారిపై చిందులు తొక్కాడు. దీంతో తహసీల్దార్ నివ్వెరపోయాడు. తన ఎదుటే రైతులను ఇలా మాట్లాడడం ఏంటని మండిపడ్డారు. రైతులతో మాట్లాడే విధానం నేర్చుకోవాలంటూ మందలించారు. రైతుల ఫిర్యాదు మేరకు వీఆర్వో కాటమయ్య చేసిన ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లపై డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోతో క్షేత్రస్థాయిలో కమిటీ వేసి, విచారణ చేపడతామని తహసీల్దార్ తెలిపారు. దీంతో రైతులు వెళ్లిపోయారు.



తహసీల్దార్ ఎదుటే రైతులపై చిందులు తొక్కుతున్న వీఆర్వో కాటమయ్య (వృత్తంలో..)

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మహర్షి వాల్మీకి (జయంతి)



సంస్కృత సాహిత్యంలో ఆది కవిగా పేరొందిన మహర్షి వాల్మీకి ఆశ్వయుజ పూర్ణిమన జన్మించినట్టు పరిగణిస్తారు. శ్లోకమనే ప్రక్రియను ఆయనే ప్రవేశ పెట్టారు. రామాయణాన్ని 24వేల శ్లోకాలతో, ఏడు కాండలుగా రచించారు. వల్మీకం (పుట్ట) నుంచి రావడంతో వాల్మీకిగాను, రామరామ అంటూ తపస్సు చేయడంతో మహర్షిగా పేరొందారు. రామాయణ రచనతో ప్రజల మన్ననలు పొందారు.

అర్థర్ మిల్లర్ (జయంతి)



అమెరికాకు చెందిన నాటక రచయిత, వ్యాసకర్త అర్థర్ మిల్లర్ 1915 అక్టోబరు 17న జన్మించారు. 7 దశాబ్దాలకుపైగా రచయితగా కొనసాగారు. 'డెత్ ఆఫ్ ఎ సేల్స్‌మన్' అనే నాటకం 20వ శతాబ్దంలో అమెరికన్ నాటకాలలో ఎంతో పేరొందింది. నాటక రంగంలో సేవలకు 'పులిట్జర్ ప్రైజ్', పలు పురస్కారాలు పొందారు. న్యూయార్క్‌లోని 'అమెరికన్ థియేటర్ హాల్ ఆఫ్ ఫేమ్'లో సభ్యుడు. 2005 ఫిబ్రవరి 10న కన్నుమూశారు. ఆయనకు సంతాపంగా బ్రాడ్‌వే థియేటర్లలో ప్రదర్శనలు నిలిపేశారు.

స్మితా పాటిల్ (జయంతి)



ప్రముఖ బాలీవుడ్ నటి స్మితా పాటిల్ 1955 అక్టోబరు 17న పూనెలో జన్మించారు. నాటక రంగం నుంచి బుల్లితెరపైనా, వెండితెరపైనా సత్తా చాటుకున్నారు. పదేళ్లలో హిందీ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, కన్నడ భాషలలో 80కుపైగా సినిమాలలో నటించారు. 1985లో 'పద్మశ్రీ' పొందారు. రెండు జాతీయ, ఒక ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. మహిళల హక్కులకోసం ఆమె ప్రత్యేకంగా కృషి చేశారు. 31వ ఏట 1986 డిసెంబరు 13న కన్నుమూశారు. కాగా మరణానంతరం ఆమె నటించిన పది సినిమాలు విడుదలయ్యాయి.

అనిల్‌కుంబ్లే (పుట్టినరోజు)



ప్రముఖ క్రికెటర్ అనిల్‌కుంబ్లే 1970 అక్టోబరు 17న బెంగళూరులో జన్మించారు. 18ఏళ్లపాటు టెస్ట్‌మ్యాచ్‌లలో, వన్డేలలోనూ క్రికెటర్‌గా, కోచ్‌గా, కామెంటేటర్‌గా రాణించారు. ఉత్తమ లెగ్‌స్పిన్ బౌలర్‌లలో ఒకరు. టెస్ట్‌క్రికెట్‌లో 619 వికెట్లు తీసిన ఘనత ఉంది. 2005లో 'పద్మశ్రీ' పొందారు. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్ జట్లకు మెంటార్‌గా, ఐసీసీ జట్టుకు ప్రధాన కోచ్‌గా వ్యవహరించారు. ఐసీసీ హాల్ ఆఫ్ ఫేంలో చోటు పొందిన దేశ నాల్గవ క్రికెటర్. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ జట్టుకు ప్రధాన కోచ్‌గా ఉన్నారు.

కీర్తి సురేశ్ (పుట్టినరోజు)



ప్రముఖ మోడల్, నటి కీర్తి సురేశ్ 1992 అక్టోబరు 17న చెన్నైలో జన్మించారు. తమిళ, తెలుగు, మళయాళ సినిమాలలో నటించారు. అలనాటి నటి సావిత్రి బయోపిక్ 'మహానటి'తో ఉత్తమ నటిగా నేషనల్ ఫిల్మ్ అవార్డ్ పొందారు. తండ్రి జీ సురేశ్‌కుమార్ దర్శకత్వం వహించిన కొన్ని సినిమాలలో బాలనటిగా నటించారు. 5 సైమా, 2 ఫిల్మ్‌ఫేర్, 2 జీ సినిమా ఇతర అవార్డులు అందుకున్నారు. పలు భాషల సినిమాల ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

వైద్యవృత్తిని పవిత్రంగా భావించండి



డాక్టర్ సీఎన్ మంజునాథ్‌కు సన్మానం

బెంగళూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వైద్యవృత్తి పవిత్రమైనదని అది అలోపతి, హోమియోపతి ఏదైనా సింపతి ముఖ్యమని బెంగళూరు గ్రామీణ ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ అభిప్రాయపడ్డారు. ఆక్స్‌ఫర్డ్ మెడికల్ కళాశాలలో బుధవారం తొలి ఏడాది ఎంబీబీఎస్ తరగతులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ దేశంలో 700 మెడికల్ కళాశాలలు ఉన్నాయని, ఏటా 1.10 లక్షలమందికి మెడికల్ సీట్లు సాధ్యమన్నారు. నగరాలలో వైద్యుల కొరత లేదని గ్రామీణ ప్రాంతాలలో తీవ్రమైన సమస్య ఉందని, అక్కడి ఆసుపత్రులలో సేవలందించేలా యువవైద్యులు వ్యవహరించాలన్నారు. విద్యార్థులు విశ్వాసంతో ముందుకెళ్లాలని, ఒత్తిడి పెంచుకుంటే సమస్యలు కొని తెచ్చుకున్నట్టే అన్నారు. న్యూరోవైద్య నిపుణులు డాక్టర్ ఎన్‌కే వెంకటరమణ మాట్లాడుతూ సమాజంలో వైద్యులు, ఉపాధ్యాయులకు ప్రత్యేకమైన గౌరవం ఉందని, వాటికి భంగం కలిగించకుండా వ్యవహరించా లన్నారు. డాక్టర్ వృత్తి పుస్తకంద్వారా అధ్యయనంతోపాటు సమాజం నుంచి కూడా నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజునాథ్‌ను ఆత్మీయంగా సత్కరించారు. ఆక్స్‌ఫర్డ్ గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్ఎన్‌వీఎల్ నరసింహరాజు, డీన్, డైరెక్టర్ సీఆర్ జయంతి, వై శ్రీనివాసులు, సూపరింటెండెంట్, డాక్టర్ వీబీ గౌడ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రజని, డాక్టర్ ఎంకే సుమ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుపై మాజీ ఎంపీ ఆగ్రహం



మీడియా సమావేశంలో మాజీ ఎంపీ మునిస్వామి తదితరులు

శిడ్లఘట్ట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లపై రాళ్లు రువ్వి, పోలీసులపై దాడి చేసిన నిందితులకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం అండగా ఉందని మాజీ ఎంపీ మునిస్వామి ఆరోపించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ విధానసౌధలో పాకిస్థాన్‌కు అనుకూల నినాదాలు చేసినవారిపై కేసులను వాపసు తీసు కోవడం ద్వారా దిగజారుడు రాజకీయాలకు పాల్పడు తోందని తద్వారా పోలీసులలో నైతికస్థైర్యం తగ్గించేం దుకు కారణమైందన్నారు. ముడా వివాదం నేపథ్యంలో సీఎం సిద్దరామయ్య నైతిక బాధ్యతతో తన పదవికి రాజీనామా చేయడంతోపాటు హుబ్బళ్ళి కేసును వాపసు తీసుకునే నిర్ణయాన్ని పరిష్కరిం చాల్సి ఉందన్నారు. గతంలో సీఎం యడియూరప్పపై ఎఫ్ఐఆర్ నమోదైన వేళ నిష్పక్షపాత దర్యాప్తుకోసం రాజీనామా చేయాలని సిద్దరామయ్య డిమాండ్ చేశారని, అప్పట్లో యడియూరప్ప రాజీనామా చేశారన్నారు. ప్రస్తుతం సిద్దరామయ్య కూడా ఆత్మసాక్షిగా నైతికతతో ఎందుకు రాజీనామా చేయరని ప్రశ్నించారు. హుబ్బళ్ళి కేసు వాపసు చేసే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునఃపరిశీలించాల న్నారు. ఓటు బ్యాంకు కోసం కాకుండా సమాజం లోని అన్నివర్గాల ప్రజలను విశ్వాసంలోకి తీసుకుని ప్రభుత్వం పనిచేయాలన్నారు. దేశం, రాష్ట్రం కోసం, నీరావరి తదితర పోరాటాల్లో పాల్గొన్న విద్యార్థులపై ఉన్న కేసులను వాపసు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపైనా, పోలీసులపై రాళ్లు రువ్వినవారిపై కేసులు వాపసు తీసుకోరాదన్నారు. ఓటు బ్యాంకుకోసం ఒక వర్గంకోసం ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదన్నారు. ఇటీవలి జమ్ము -కశ్మీర్, హరియాణ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. కాగా బీజేపీ సభ్యత్వ నమోదులో కోలారు లోక్‌సభ పరిధిలో శిడ్లఘట్ట తాలూకా ప్రథమస్థానంలో ఉందన్నారు. ఇందుకు శిడ్లఘట్టకు చెందిన బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ ఎంతో కృషి ఉందని అభి నందించారు. చన్నపట్టణ ఉప ఎన్నికల్లో బీజేపీ అధిష్ఠానందే తుదినిర్ణయమన్నారు. మైత్రిధర్మాన్ని పాటించాల్సి ఉంటుందన్నారు. సీపీ యోగేశ్వర్ పోటీ చేయడం ఆయన వ్యక్తిగత నిర్ణయమని బదులిచ్చారు. మీడియా సమావేశంలో నియోజకవర్గ బీజేపీ నాయకులు సీకల్ రామచంద్రగౌడ, తాలూకా బీజేపీ మాజీ అధ్యక్షుడు కమ్మదహళ్ళి సురేంద్రగౌడ, సీకల్ ఆనందగౌడ, బంగార రామకృష్ణప్ప, రేష్మి నంజీవప్ప, కనకప్రసాద్, మంజుళమ పాల్గొన్నారు.

నీటి మడుగులా దారులు



గ్రామ పంచాయతీ కార్యాలయం రోడ్డు

చేళూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్ర మైన చేళూరు గ్రామ పంచాయతీ కార్యాలయం రోడ్డు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో చిన్నపాటి కుంటగా ఇక్కడి ప్రదేశం మారింది. రోడ్డు పొడవునా ఇదే పరిస్థితి నెలకొంది. బురదమయంగా మారి నడవడానికి వీలుకాకుం డా ఉంది. కాగా ప్రతి శుక్రవారం ఈ మార్గంలోనే వారపుసంత నిర్వహిస్తారు. పంచా యతీ ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డును బాగు చేయండి



కంకరతేలిన రహదారి

నారేమద్దేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బెత్తర్లపల్లి నుంచి కురవల పల్లి, చినగానపల్లి మార్గం కంకర తేలింది. సగం రోడ్డు మాత్రమే మరమ్మత్తు చేసి వదిలేశారు. మరమ్మత్తు కోసం కంకర సిద్ధంగా ఉన్నా పనులు సాగడం లేదు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే బెంబేలెత్తాల్సిన పరిస్థితి నెలకొంది. అదే విధంగా శివపురం నుంచి వందమాను ఏటి మార్గాన బిళ్ళూరు రోడ్డును బాగు చేయాల్సి ఉంది. బాగేపల్లి నుంచి రాజువారిపల్లి, చిన్నగానపల్లి, బెస్తలపల్లి, దొడ్డివారిపల్లె, మల్లెపల్లె మీదుగా బిళ్ళూరుకు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉద్యోగుల సంఘానికి 37 నామినేషన్లు



నామినేషన్లు సమర్పిస్తున్న అభ్యర్థులు

బంగారపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి 2024-29 అవధికి తాలూకాశాఖ డైరెక్టర్, పదాధికారుల ఎన్నికల్లో ఇంతవరకు మొత్తం 37 నామినేషన్లు దాఖలయ్యాయి. బుధవారం ప్రాథమిక విద్యాశాఖ నుంచి ఆంజనేయగౌడ, వెంకటేశప్ప, సంజీవప్ప, రమేశ్, సుజాతా, తిమ్మ రాయప్పలు, అటవీశాఖ నుంచి శ్రీలక్ష్మి, అబ్కారి శాఖ నుంచి గోపి, ఆరోగ్యశాఖ నుంచి అనితా, హైస్కూల్ విద్యాశాఖ నుంచి నంజుండప్ప, వెంకటేశ్, నిర్మలా, జ్యుడీషియల్‌శాఖ నుంచి సోమశేఖర్, సాంఘిక సంక్షేమశాఖ అంజలీదేవి, వెనుకబడిన వర్గాల నుంచి ప్రభామణి, ఆర్‌డీపీఆర్ శాఖ నుంచి శంకర్, వాణిలు నామినేషన్‌లు సమర్పించినట్టు ఎన్నికల అధికారి మంజునాథచారి వెల్లడించారు. అభ్యర్థి సంజీవప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి ఈనెల 28న ఎన్నికలు జరుగనున్నాయని, నామినేషన్ సమర్పించి బరిలో ఉన్నట్టు తెలిపారు. తాలూకాలోని ఉపాధ్యాయుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా నన్నారు. మరో అభ్యర్థి సుజాత మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల మహిళా సంఘం నుంచి మొత్తం 8మంది నామినేషన్‌లు వేశామన్నారు. తొలిసారిగా మహిళా ఉద్యోగుల సంఘం నుంచి పోటీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సహాయక ఎన్నికల అధికారి జనార్థన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయండి



ప్రయాణికులు వేచి ఉండే ప్రదేశం ఇదే..

చేళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని నారేమద్దేపల్లి గ్రామ పంచాయతీ కేంద్రంలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. చేళూరు, చాకవేలు, శివపురం మార్గంలో నారేమద్దేపల్లి మీదుగా పాతపాళ్య, బాగేపల్లి వరకు బస్సు సదుపాయం ఉంది. ఆర్టీసీ బస్సులతోపాటు ప్రైవేట్ బస్సు సర్వీ సులు నడుస్తున్నాయి. అయితే గ్రామపంచాయతీ కేంద్రమైన నారేమద్దేపల్లిలో ప్రయాణీకులకోసం ఒక బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పంచాయతీ కేంద్రం కావడంతో చుట్టుపక్కల ప్రాంతాలైన జంగాలపల్లి తదితర గ్రామాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. బస్‌షెల్టర్ కోసం స్థలాన్ని కేటాయించినా ఇంతవరకు నిర్మించకపోవడంపై ప్రజలు అసం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా గ్రంథాలయాన్ని అద్దె భవనంలో కొనసాగుతోంది. గ్రంథాలయానికి సొంత భవనం కల్పించడంతోపాటు డిజిటల్ సదుపాయం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నాళ్లీ కష్టాలు..?

● బస్సు కోసం విద్యార్థుల పాట్లు



వాల్మీకి సర్కిల్ వద్ద వాహనాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

కంప్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో డిప్లొమా చదువుతున్న విద్యార్థులకు వేళకు బస్సులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజూ కళాశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు బస్టాండుకు కాలినడకన చేరుకుని అక్కడి నుంచి హోస్పేటకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాటిపై వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి రోజూ ఇలా ఇబ్బందులు పడుతుండటంతో విద్యార్థులకు చదువుపై ఆసక్తి తగ్గిపోతోంది. కనీసం విద్యార్థుల కోసం ప్రభుత్వాలు కళాశాలలు ఏర్పాటు చేసినా సరైన బస్సుసౌకర్యం లేక విద్యార్థినులు ఇళ్లకే పరిమితమయ్యారు. ఉదయం సాయంత్రం వేళలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని తాము ఇళ్లకు చేరుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశామని, కంప్లి నుంచి హోస్పేటకు వెళ్లే బస్సులు కళాశాల వద్ద నిలపాలని విజ్ఞప్తి చేశామన్నారు.

సీఎంతో వేణుగోపాల్ భేటీ



వేణుగోపాల్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న సీఎం, డీసీఎంలు

బెంగళూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ గందరగోళంపై అగ్రనేతలు సుదీర్ఘంగా చర్చించారు. బెంగళూరుకు వచ్చిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ముఖ్యమంత్రి సిద్ద రామయ్యను అధికారిక నివాసం కావేరిలో భేటీ అయ్యారు. బుధ వారం సాయంత్రం సుదీర్ఘంగా మంతనాలు సాగించారు. డీసీఎం డీకే శివకుమార్ కూడా పాల్గొన్నారు. ముడా ఇంటి స్థలాల వివాదం తర్వాత తలెత్తిన అంశాలపై చర్చించినట్టు తెలుస్తోంది.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే నాగేంద్ర

బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతిలో జైలుపాలై బెయిల్‌పై విడుదలైన ఎమ్మెల్యే బీ నాగేంద్ర బుధవారం సీఎం సిద్దరామయ్యను కలిశారు. ఈ సందర్భంగా సీఎంను ప్రత్యేకంగా సత్కరించారు. అంతకుముందు జైలునుంచి వి డుదలైన నాగేంద్ర బళ్ళారి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్ నివాసానికి వెళ్లారు. మంత్రి సాదరంగా స్వాగతించారు. శాసనసభ ఎన్నికల వేళ జైలు నుంచి బయటకు రావడం సంతోషమన్నారు. టైగ ర్ ఈజ్ బ్యాక్ అంటూ మంత్రి కొనియాడారు. కాగా బళ్ళారి నుంచి నాగేంద్ర అభిమానులు పెద్ద ఎత్తును తరలివచ్చారు.

ఉచిత ఆరోగ్య శిబిరం



శిబిరం ప్రారంభోత్సవంలో ప్రముఖులు

విజయపుర, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మారుతున్న జీవనశైలితో ఒత్తిడితో గ్రామీణ ప్రాంతం ప్రజలు డబ్బువెనుక పరుగులు తీస్తూ ఆరోగ్యం పట్ల గమనించడం లేదని ఇన్నర్‌వీల్ అధ్యక్షుడు ప్రేమా నాగరాజప్ప అభిప్రాయపడ్డారు. స్థానిక సముదాయభవనంలో బెం గళూరు ఫోర్టిస్ ఆసుపత్రి, టౌన్ ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పా టైన ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరంలో పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటైన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో మధుమేహం, రక్తపోటు, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. ఇన్నర్‌వీల్ సంస్థ సంస్థాపక అధ్యక్షులు భారతి శివప్రసాద్, మాజీ అధ్యక్షుడు నవ్యనవీన్, కార్యదర్శి మాలతి ఆనంద్ పాల్గొన్నారు.

అనుమానంతో పోస్టుమార్టం

▸▸ తండ్రి మృతిపై కుమార్తె ఫిర్యాదు

బెంగళూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బెళ గావిలోని ఆంజనేయనగర్‌లో నివసించే పారి శ్రామికవేత్త సంతోష్ మృతి పట్ల కుమార్తె అను మానం వ్యక్తం చేయడంతో పోలీసులు బుధ వారం పోస్టుమార్టం జరిపారు. ఈనెల 9న సంతోష్ పద్మన్న ఇంట్లోనే మృతి చెందారు. కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సదాశివ నగర్‌లోని లింగాయత శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిపారు. అయితే కుమార్తె సంజనా తండ్రి సంతోష్ మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఏసీ శ్రవణ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు, మెడికల్ కళాశాల వైద్య నిపుణులు, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో బుధవారం పోస్టుమార్టం జరిపారు. తండ్రి సంతోష్‌ది సహజమృతి కాదని, హత్య జరిగిందని, ఈ కుట్ర వెనుక తల్లే ఉన్నారని కుమార్తె ఆరోపించారు. సంతోష్ మృతి చెందినరోజు గంట సమయంపాటు సీసీటీవీ ఫుటేజ్ డిలీట్ అయ్యిందని కుమార్తె ఆరోపించారు. ఎదురింట్లోని సీసీటీవీ ఫుటేజీలలో ఇదే సమయంలోనే ఇద్దరు పురుషులు ఇంట్లోకి ప్రవేశించే దృశ్యాలు ఉన్నాయని ఆరోపిం చారు. దీంతో పోలీసులు కొత్త కోణంలో విచారణలు ఆరంభించారు. కాగా పోస్టుమార్టం నివేదిక అందాక మరిన్ని అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

రేణుకాస్వామికి పుత్ర సంతానం

బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి స్వామికి కొడుకు పుట్టాడు. ఆయన భార్య సహన చిత్రదుర్గలోని ఓ ఆసుపత్రిలో బుధవారం మగ శిశువుకు జన్మనిచ్చారు. రేణుకాస్వామిని కోల్పోయినప్పటి నుంచి విషాదంలో ఉన్న ఆ కుటుంబంలో బిడ్డ జననం ఒకింత సంతోషాన్ని కలిగించింది. రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్‌తో పాటు పలువురు జైలులో గడపుతున్నారు. దర్శన్ బెయిల్ పిటిషన్ 57వ సీసీహెచ్ కోర్టులో రద్దు కావడంతో మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

● జిల్లా అధికారి నితీశ్



ఇందిరా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న డీసీ

రాయచూరు, అక్టోబరు 16: ఇందిరా క్యాంటీన్‌లో నాణ్యత ప్రమాణాలతో ఆహారం ఉండాలని జిల్లా అధికారి కే నితీశ్ ఆదేశించారు. బుధవారం సింధనూరు నగరంలోని కేంద్ర బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న ఇందిరా క్యాంటిన్‌ను ఆయన తనిఖీ చేశారు. అక్కడున్న పేదలతో కొద్దిసేపు ఆయన మాట్లాడారు. క్యాంటిన్‌లో లభిస్తున్న ఆహారం రుచి నాణ్యత, శుభ్రత గురించి వారి నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్యాంటిన్‌లలో ఆహార పదార్థాలు తాజాగా ఉండాలని శుచి శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం నగరానికి తాగునీరందించే తాగునీటి ప్లాంట్‌ను జిల్లాధికారి పరిశీలించారు. నీరు కలుషితం కాకుండా అప్రమత్తంగా ఉండాలని నగరసభ అధికారులను ఆదేశించారు. కాలానుగుణంగా ఎప్పటికప్పుడు బ్లీచింగ్, ఆలం వంటి వాటిని వాడాలని, తాగునీరు ఎప్పటికప్పుడు శుద్ధి చేయాలన్నారు. అక్కడి నుంచి డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. నగరంలో నుంచి సేకరించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డ్‌కు తరలించి నగర స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో సోమప్ప చెరువు




చెత్తాచెదారంతో నిండిన చెరువు

కంప్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఉన్న సోమప్ప చెరువు అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. గతంలో ఈ చెరువును మాజీ ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మమ్మై సందర్శించి వాయనం కూడా వదిలారు. అప్పట్లో ముఖ్యమంత్రి వస్తారన్న నెపంతో చుట్టూ విద్యుత్ లైట్లు, స్వచ్ఛత చేపట్టి సుందరంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం సోమప్ప చెరువు అభివృద్ధికి నోచుకోవడం లేదు. సరైన లైట్ల వ్యవస్థ, ఉదయం, సాయంత్రం వేళల్లో యోగా, వాకింగ్ చేసే వారికి, మహిళలకు శౌచాలయాలు లేవు. దీనికి తోడు చెరువులోకి పట్టణంలోని మురుగు నీరు చేరుతున్నాయి. పాదచారులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. చెరువులోచెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పేరుకు మాత్రమే సోమప్ప చెరువుగా నిలిచిందని, ఇక్కడ ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా అభివృద్ధి చేపట్టి రాత్రి వేళల్లో లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


హులిగి అభివృద్ధికి బ్లూప్రింట్ ఖరారు

● త్వరలో పనులు ప్రారంభం
● తీరనున్న భక్తుల సమస్యలు



హులిగమ్మ ఆలయం ఏరియల్ వ్యూ...

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా హులిగిలో వెలసిన హులిగమ్మ దేవాలయ అభివృద్ధికి ఇప్పటికే రూపొందించిన బ్లూ ప్రింట్‌ను ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి రామలింగా రెడ్డి ఈ మధ్యనే హులిగి దేవస్థానాన్ని సందర్శించిన సమయంలో అక్కడ నెలకొన్న సమస్యలను పరిశీలించారు. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై పరిశీలన జరిపిన అనంతరం ఇప్పటికే సిద్ధం చేసిన బ్లూప్రింట్‌లో మార్పులు ఉంటే నెలరోజుల్లోగా మార్చాలని అధికారులకు మంత్రి సూచించారు. ప్రస్తుతం దేవాలయ అభివృద్ధికి రూపొందించిన బ్లూప్రింట్‌ను చాలా రోజుల క్రితం తయారు చేసినందున ఆర్కిటెక్ట్ బృందం సహాయం తీసుకోవాలని అధికారులకు మంత్రి సూచించారు. దీనిపై సమీక్షలు జరిపిన అధికారుల బృందం ప్రస్తుతం బ్లూప్రింట్‌పై తుదిముద్ర వేసేందుకు సిద్ధమైంది. మరికొన్ని రోజుల్లో జిల్లా కలెక్టరు నేతృత్వంలో సమావేశం నిర్వహించి, అనంతరం మంత్రి రామలింగారెడ్డి అధ్యక్షతన ప్రస్తుత బ్లూ ప్రింట్‌కు ఆమోదముద్ర వేయనున్నారు. హులిగి ఆలయానికి కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. ప్రస్తుతం బ్లూ ప్రింట్‌లో అన్ని వసతులతో కూడిన మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, ఆలయం వెనుక తుంగభద్ర నది పరిశుభ్రత, వ్యర్థాల తొలగింపు, ఆలయ ప్రదక్షిణ మార్గాన్ని విస్తరించడం తదితర అనేక అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించారు. నది ఒడ్డున ఎగిసిపడే బట్టలు, ప్లాస్టిక్ వ్యర్థాలను పారవేయడం ఇక్కడ పెద్ద సవాలుగా మారింది. నది ఒడ్డున ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి వాటిని సేకరించడం భారంగా మారింది. స్నానం చేసిన వారి బట్టలు, ఇతర వ్యర్థాలను నిర్దిష్ట ప్రదేశంలో వేయడానికి ఏర్పాటు చేయల్సి ఉంది. అప్పుడే వ్యర్థాల తొలగింపు కూడా సులభతరం అవుతుందని హులిగి గ్రామానికి చెందిన పలువురు భక్తులు అభిప్రాయ పడుతున్నారు. రాష్ట్రప్రభుత్వం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ ఆలయం ఖాతాలో రూ. 70 కోట్లు ఉంది. భక్తులు సమర్పించిన వెండి, బంగారు ఆభరణాలు ఉన్నాయి. రవాణా సంస్థ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం శక్తి యోజన అమల్లోకి వచ్చిన తరువాత ఆలయాన్ని సందర్శించే భక్తుల సంఖ్య పెరిగింది. ప్రతి మంగళ, శుక్ర, పౌర్ణమి రోజుల్లో భక్తుల సంఖ్య లక్ష దాటుతోంది. భక్తుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గత ఏడాది డిసెంబరులో హులిగి ప్రాంతాన్ని సందర్శించి తిరిగి వచ్చిన కొద్ది రోజుకే రామలింగారెడ్డి టైగర్ అథారిటీగా ప్రకటించారు. ప్రస్తుతం అభివృద్ధి పనులకు సంబంధించిన బ్లూప్రింట్ ఖరారైంది. ఇప్పటికైనా అభివృద్ధి పనులు శరవేగంగా ప్రారంభించాలని భక్తులు భక్తులు కోరుతున్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.95	1,614.11
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	45,287	1125
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	45,891	9,134
సామర్థ్యం (టీఎంసీలు)	101.58	46.34

అమ్మవారి భక్తుడికి ఆర్థిక సాయం

గంగావతి రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గమ్మ ఆలయంలో 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్న యేసు అనే భక్తుడికి ఆలయ కమిటీ వైద్యం కోసం రూ.50 వేలు ఆర్థికసాయం అందజేసింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు హెచ్‌ఆర్ శ్రీనాథ్ ఆర్థిక సహాయం చెక్కును భక్తుడు యేసుకు అందజేశారు. ఆ దుర్గమ్మ తల్లి యేసుని కాపాడాలని ఆయన ప్రార్థించారు. కార్యక్రమంలో హను మంతప్ప నాయక, వీరభద్రప్ప నాయక్, కృష్ణప్ప నాయక్, బసప్ప నాయక్, చౌడికి రమేష్ పాల్గొన్నారు.

నాగేంద్ర విడుదలతో సంబరాలు



దుర్గమ్మ ఆలయం ముందు కొబ్బరికాయలు కొడుతున్న ఎమ్మెల్యే నాగేంద్ర అభిమానులు

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బళ్లారి రూరల్ ఏ ఎమ్మెల్యే బి. నాగేంద్ర బెయిల్‌పై విడుదలైన నేపథ్యంలో ఆయన అభిమానులు నగరంలో సంబరాలు జరుపుకుని స్వీట్లు పంచుకున్నారు. బళ్లారి దుర్గమ్మ దేవా లయం ముందు ఆయన అభిమానులు 1011 కొబ్బరి కాయలు కొట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వాల్మీకి అభివృద్ధి మండలి కేసులో ఇన్ని రోజులు జైలు వాసయం గడిపిన నాగేంద్ర 14వ తేదీన కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అదే రోజున బళ్లారి నగరం రాయల్ సర్కిల్‌లో నాగేంద్ర అభిమానులు సంబరాలు జరుపు కోగా... బుధవారం పరప్పనహార జైలు నుంచి బయటకు వచ్చిన ఆయనకు అభిమానులు జేజేలు పలికారు. తమ అభిమాన నాయకుడిని చూసేందుకు రెండు రోజులు క్రితమే గ్రామీణ నియోజకవర్గం పరిధిలో చాలామంది అభిమా నులు, మిత్రులు, పార్టీ కార్యకర్తలు బెంగళూరుకు వెళ్లారు.

స్థాయీ సమితి అధ్యక్షురాలిగా ఉలిగిబాయి



ఉలిగిబాయికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అధ్యక్షులు, కౌన్సిలర్లు

కంప్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా మరియమ్మనహళ్లి పట్టణ పంచాయతీస్థాయీ సమితి అధ్య క్షురాలిగా ఉలిగిబాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనం తరం ఆమెకు పలువురు సభ్యులు సన్మానించారు. ఆమె మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరిం చాలని కోరారు. అప్పుడే పట్టణ అభివృద్ధి చెందుతుం దని అన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని అభి వృద్ధి రూపంలో చూపెడతామన్నారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు అదిమని హుస్సేన్‌బా షా, సభ్యులు వసంతకుమార్, సుమంగళ, మంజునాథ్, పరశురామ్, జ్యోతి, సురేష్ పాల్గొన్నారు.

నుదుటిపై కుంకుమ ఉంటేనే ఆలయ దర్శనం



జగదాంబ ఆలయం ముందు బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

కంప్లి, అక్టో బరు 16 (ఆంధ్ర జ్యోతి): హోస్పేట తాలూకా జగ దాంబ దేవస్థా నంలో అమ్మవా రిని దర్శించుకునే మహిళలకు నుదుటన కుంకుమ ఉన్నవా రికి మాత్రమే ప్రవేశం కల్పిస్తామని ఆలయ కమిటీ సభ్యులు ఆలయం ముందు బోర్డు ను ఏర్పాటు చేశారు. ప్రస్తుత సమాజంలో మహిళలు సంప్రదాయాలను మరిచి నుదుట కుంకుమను వదిలేసి కేవలం స్టిక్కర్లపైనే ఉంటున్నారు. దేశ సంప్రదా యాలను మరువరాదని ఆలయ కమిటీ ముందుకొచ్చి అమ్మవారిని దర్శించేందుకు ప్రతి మహిళా కుంకుమను నుదుటిపై ధరించి ఆలయంలో అమ్మవారిని దర్శించుకోవా లని సూచించారు.




నగరంలోని కౌల్‌బజార్ అండర్ బ్రిడ్జి కింద నిలిచిన వర్షపు నీరు

భారీ వర్షం

బళ్లారి రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లాలో తుపాను ప్రభా వంతో మంగళ, బుధవారాల్లో భారీ వర్షం కురిసింది. బళ్లారి నగరంతో పాటు సండూరు, సిరుగుప్ప, కురుగోడు, కంప్లితో పాటు బళ్లారిరూరల్‌లో భారీ వర్షం కురవడంతో రాకపోకలకు తీవ్రంగా అంతరాయం ఏర్పడింది. పలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు వాగులు, వంకలు పొంగిపొర్లడంతో తీవ్ర ఇబ్బంది లకు గురయ్యారు. నగరంలో లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యతో నగర వాసులు ఇబ్బందులకు గురయ్యారు. బళ్లారి కౌల్‌బజార్ వెళ్లే అండర్‌బ్రిడ్జి సమీ పంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సిరుగుప్ప: సిరుగుప్పలో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జల మయమయ్యాయి. పోలీసుస్టేషన్‌లో వర్షంపునీరు చేరాయి. భారీ వర్షాల కార



సిరుగుప్పలో కురుస్తున్న వర్షం

ణంగా జనజీవనం స్తంభించిపోయింది. ఈ యేడాది పుష్కలంగా వర్షాలు కుర వడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు పంటలు పండించుకోవ చ్చునని అంటున్నారు.

ఏఐయూటీయూసీ సదస్సును విజయవంతం చేయండి

బళ్లారి సిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మైసూరులో 26, 27 తేదీల్లో నిర్వ హించనున్న ఏఐయూటీయూసీ 4వ రాష్ట్రస్థాయి కార్మిక సదస్సును విజయ వంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా అధికారంలో ఉన్న బీజేపీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు దేశ సంపదను, శ్రమశక్తిని దోచుకునేలా ఉన్నాయన్నారు. ప్రజల పన్ను సొమ్ము, కార్మికుల శ్రమతో నిర్మించిన రైల్వే, బ్యాంకు, బీమా, ఉక్కు, బొగ్గు విద్యుత్ ఉత్పత్తి తది తర ప్రభుత్వరంగ సంస్థలు టాటా, అంబానీ, అదానీ తదితర కార్పొరేట్ సంస్థ లకు అప్పగించాలని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యజమా నులకు అనుకూలంగా కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్‌కోడ్‌లను రూపొం దించిందన్నారు. కర్ణాటకలో కూడా గత బీజేపీ ప్రభుత్వం చట్టాన్ని సవరించి ఉదయం 8 నుంచి 12 గంటల వరకు పనివేళలను పెంచి, మహిళలకు నైట్ షిఫ్టును ప్రవేశపెట్టడం దారుణమన్నారు. సమ్మేళనానికి రాష్ట్రంలోని వివిధ జిల్లా



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐయూటీయూసీ నాయకులు

లనుంచి పరిశ్రమల కార్మికులు, వైద్యకీయ కాలేజ్, ప్రభుత్వ హాస్టల్స్ విశ్వవి ద్యాలయ తదితర క్షేత్రాల కాంట్రాక్టు ఉద్యోగులు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లాకార్యదర్శి డాక్టర్ ప్రమోద్, ఉపాధ్యక్షులు శాంత, సురేశ్ పాల్గొన్నారు

మాజీ మంత్రి నాగేంద్ర నేడు బళ్లారికి రాక

- స్వాగత ఏర్పాట్లు చేసిన అభిమానులు
- వాల్మీకి జయంతి రోజున రావాలని నిర్ణయం

బళ్లారి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి అది ఊహించలేని ఎదురు దెబ్బ అంత వరకూ రాజకీయంగా ప్రశాంతంగా సాగిపోతున్న తరు ణంలో ఒక ఉద్యోగి ఆత్మహత్య రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలోకి నెట్ట డంతో పాటు ఆ శాఖ మంత్రి జైలు పాలు కావాల్సి వచ్చింది. ఏకంగా 22 మందిపై కేసులు నమోదయ్యాయి. దీనిపై సుదీర్ఘంగా 95 రోజుల క్రితం మాట. ప్రస్తుతం పరిస్థితి మారింది. జైల్లో ఉన్న మాజీ మంత్రి బి. నాగేంద్రకు కోర్టు ఊరట కలిగించింది. ఆయనకు మంగళవారం బెయిల్ మంజూరు అయింది. గురువారం మాజీ మంత్రి బి. నాగేంద్ర బళ్లారికి రానున్నారు. ఇందుకు ఆయన అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ స్వాగతం ఏర్పాట్లు సిద్ధం చేశారు. జూలై 13న మంత్రి నాగేంద్రను బెంగళూరులో ఈడీ అరెస్టు చేసింది. వాల్మీకి నిగమ మండలిలో రూ. 187 కోట్లు అక్రమాలు జరిగాయనేది అభి



ఇన్‌చార్జ్ మంత్రితో మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగేంద్ర

యోగం. ఈ డబ్బులను నిగమ ఖాతా నుంచి వివిధ ఖాతాలకు మళ్లించారని ఈడీ పేర్కొంది. 95 రోజుల తరువాత ఆయన బళ్లారికి రానున్నారు. సండూరు ఉప ఎన్నికల నేపథ్యంలో నాగేంద్ర బయటకు రావడం కాంగ్రెస్‌కు ఎంతవరకూ లాభం అనేది చర్చ సాగుతుంది. సండూరు ఉప ఎన్నికల్లో గాలి జనార్దనరెడ్డి, బి. నాగేంద్ర ఎంత వరకూ పనిచేస్తారు అనేది చర్చ సాగుతుంది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభమయ్యేనా?

- కరూరు గ్రామ ప్రజలకు అందని వైద్యం
- నిద్రావస్థలో జిల్లా ఆరోగ్య శాఖ
- కళ్యాణ కర్ణాటక నిధులు వృథా

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కరూరు గ్రామ ప్రజలకు వైద్యం అందని ద్రాక్షపండులా మారింది. కల్యాణ కర్ణాటక నిధులు రూ.40 లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆదనపు గదులు ప్రారం భించకపోవడంతో రోగులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. బళ్లారి జిల్లా, తెక్కలకోట పరిధిలోని కరూరు గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రికి అదనపు గదుల నిర్మాణం పనులు ప్రారంభమై మూడు సంవత్సరాలు గడిచినా ఇంకా పూర్తికాకపోవడం పట్ల స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విష యంపై జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రాకు ప్రజల నుంచి ఫిర్యాదులు



ప్రారంభానికి నోచుకోని కరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అందడంతో ఆయన నేరుగా ఆసుపత్రిని సందర్శించి ఏప్రిల్‌లోగా పనులు పూర్తి చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. జిల్లాధికారి ఆదే శించి ఆరు నెలలు దాటినా పనులు పూర్తి చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని గ్రామ ప్రముఖులు ఆరోపిస్తున్నారు. జిల్లాధికారి సందర్శించిన తరువాత గదులకు అవసరమైన రంగులు, సీలింగ్‌ఫ్యాన్లు, విద్యు త్, ఫ్యాన్లు ఏర్పాటు మినహా... పనులు పూర్తికావడానికి అదనంగా రూ 6.75లక్షలు విడుదల చేసినా పనులు పూర్తికాలేదు. కరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 18 గ్రామాల ప్రజలు వైద్య సేవలు అందించాల్సి ఉంది. ఆసుపత్రిలో ప్రతి నెలా 25 నుంచి 30 కాన్పులు, రోజూ 200మందికి పైగా రోగులు వైద్యం కోసం వస్తుంటారు. నర్సిత గదుపల్లగా పనులు పూర్తికాకపో వడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు ప్రారంభించి ప్రజలకు అవసరమైన వైద్యం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గదిలో నేలమీద వదిలేసిన సీలింగ్ ఫ్యాన్లు

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- అధికారులకు డీసీ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వ హించాలని జిల్లా అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా సూచించారు. డీసీ కార్యా లయంలో బుధవారం ప్రభుత్వ అధికారులతో జిల్లా అధికారి సమావేశం నిర్వహించారు. బళ్లారి జిల్లా సండూరు శాసనసభ ఉప ఎన్నికలకు కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు కోడ్‌ను పాటించాలని ఆయన సూచించారు. కోడ్ ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించవని ఆయన హెచ్చ రించారు. ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబరు 18 నుంచి అమల్లో ఉంటుంది. నామినేషన్లకు చివరి తేదీ 25, నామినేషన్ల పరిశీలన 28, ఉప సంహరణ 30, పోలింగ్ నవంబరు 13, ఓట్ల లెక్కింపు 23 ఉంటుందన్నారు. సండూ గూరు నియోజకవర్గంలో కోడ్ అమల్లో ఉండగా రాజకీయ నాయకులు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుపరాదని సూచించారు. పార్టీల జెండాలు కార్యాలయాల వద్ద తొలగించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఎస్పీ శోభ రాణి, ఏడీసీ మహమ్మద్ జుబేర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై కార్పొరేషన్ కొరడా



అనంతపురం రోడ్డులో ప్రచార ఫ్లెక్సీలు తొలగిస్తూ...



కాళమ్మ వీధిలో ఫుట్‌పాత్‌పై ఉన్న మెట్లుతొలగిస్తున్న దృశ్యం

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రోడ్లలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై కార్పొరేషన్ అధికారులు కొరడా ఝుళిపించారు. పాద చారులకు నిర్మించిన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించుకుని అంగళ్లలో ఉంచాల్సిన వస్తువులు ఫుట్‌పాత్‌పై ఉంచడంతో పాదచారులు కార్పొరేషన్ అధి కారులకు ఫిర్యాదులు చేశారు. వారం రోజుల క్రితం ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని అధికారులు సంబంధిత వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. దుకాణదారులు అధికారుల హెచ్చరికలను పట్టించుకోకపోవడంతో బుధవారం కార్పొరేషన్ అధికారులు, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు, సిబ్బంది మార్కింగ్ వేసి ఎక్స్‌కవేటర్ల సాయంతో ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

రాయచూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ప్రధాన కాలువ డిస్ట్రిబ్యూటరీకి సాగునీరు విడుదల చేయాలని రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. మాన్వి తాలూకాలోని హిరేకొట్నేకల్ గ్రామానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో సాగునీటి శాఖ కార్యాలయానికి వచ్చి ఆందోళ నకు దిగారు. 76వ లింక్ కెనాల్‌కు నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతు న్నాయని అక్కల్లో అప్పు చేసి వేసుకున్న పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవే దన వ్యక్తం చేశారు. అనంతరం ఇంజనీర్ వినయకుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన ఇంజనీర్ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఇతరులకు అవకాశం కల్పించండి

తోరణగల్లు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సండూరు ఉప ఎన్నికల్లో ఇతరులకు అవ కాశం కల్పించాలని కాంగ్రెస్‌లోని ప్రముఖులు, కార్యకర్తలు మంత్రి సంతోష్‌లాడ్‌కు విన్నవించారు. బుధవారం తోరణగల్లు స్టేషన్‌లోని విజయలక్ష్మీ థియేటర్ సభా భవ నంలో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రముఖులు నుంచి అభిప్రాయాలు సేకరించారు. సండూరు స్థానంలో ఎమ్మెల్యేగా ఉన్న తుకారామ్ బళ్లారి జిల్లా ఎంపీగా ఎన్నిక కావడంతో ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో సండూరు స్థానానికి ఉప ఎన్నిక జరుగుతోంది. సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఒకే కుటుంబంలోని వారికి ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి అవకాశం కల్పించరాదని ఎస్టీ వర్గంలోని ఇతరులకు అవకాశం కల్పించా లని కోరారు. మాజీ జడ్పీ సభ్యుడు లక్ష్మణ్, వసంత్ కుమార్, జయన్న, జగన్నాథ్, శివ మూర్తి, దమ్మురప్ప, వసగిరప్ప, తిప్పయ్య, రవి కుమార్, సీయం దుర్గేష్, చంద్రశేఖర్, అంతపుర, మెట్రి, తోరణగల్లు, ఇతర ప్రాంతాల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనం బోల్తా.. 13 మందికి గాయాలు

రాయచూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): యాదగిరి జిల్లా సైదాపూర్ నుంచి మంత్రాలయం వెళుతున్న క్రూసర్ వాహనం బుధవారం బోల్తాప డింది. రాయచూరు తాలూకాలోని కెరెబూదూరు సమీపంలో రాయచూరు- మంత్రాలయం జాతీయ రహదారి 167పై అదుపు తప్పి వాహనం బోల్తాకొ ట్టడంతో అందులో ప్రయాణిస్తున్న 13 మంది గాయపడ్డారు. ప్రమాదంలో వాహనం నడిపే డ్రైవర్ తీవ్రగాయాలు కాగా యరగేరాలోని ప్రభుత్వ ఆస్ప త్రికి తరలించారు. ఇడపనూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

హోసూరు జోన్

కొనసాగుతున్న వర్షపునీటి తొలగింపు పనులు

హోసూరు(కృష్ణగిరి), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి మున్సిపాలిటీ, సేలం జాతీయ రహదారి ఆంజనేయ ఆలయం ఫ్లైఓవర్ సమీపంలో వర్షపునీటి తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. జిల్లా మానిటరింగ్ అధికారి శిల్పా ప్రభాకర్ సతీష్, కలె క్టర్ కె.ఎం.సరయు సమక్షంలో సందర్శించి పరిశీలించారు. కృష్ణగిరి మున్సిపాలిటీ దనంబట్టి దేవసముద్రం సరస్సులోకి వర్షపు నీటిని అనుమతించడానికి ఎక్స్‌కవేటర్ ద్వారా వాటర్ చానెల్ ఇచ్చారు. తిరువణ్ణామలై మెయిన్ రోడ్డు గణపతి నగర్‌లో నిలిచిన వర్షపు నీటిని తొలగించే పనులను పరిశీలిస్తున్నారు. నగర ప్రాంతాల్లో అక్ర మణలు, వర్షపునీటి కాలువల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని, డ్రైనేజీలను ఆక్రమించిన దుకాణాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం హోసూరు కెలవరపల్లి ఆనకట్ట నుంచి కృష్ణగిరి కేఆర్‌పీ డ్యామ్‌లోకి 2700 ఘనపుటడుగుల నీరువచ్చే ఆ నీరంతా విడుదల చేశారు. డ్యామ్ భద్రత దృష్ట్యా డ్యామ్ నుంచి మొత్తం నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. దీంతో జిల్లా అధి కారులు దక్షిణ పినాకిని డ్యామ్ వరకు నదీతీరం లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజ లకు వరద హెచ్చరిక జారీ చేశారు. కేఆర్‌పీ డ్యామ్ వద్ద 2000 ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచారు. కార్యక్రమంలో కృష్ణగిరి మున్సిపల్ కౌన్సిల్ అధ్యక్షురాలు పరిమా నవాజ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరివోలి, కమిషనర్ పొన్నాల, మున్సిపాలిటీ కమిష నర్ రామకృష్ణన్, అధికారులు శివప్రకాశం, చెల్లక్కన్నమాళ్ పాల్గొన్నారు.



కేఆర్‌పీ డ్యాంను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

భక్తులకు అన్నదానం

హోసూరు అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): హోసూరులో తమిళుల పురటాసి మాసం పౌర్ణమికి ముందు రోజున ముత్తుమారియమ్మన్ ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ప్రతి నెల పౌర్ణమి సందర్భంగా బెంగళూరు లోని హోసూరు నగరం జాతీయ రహదారిపై అత్యంత పురాతనమైన ముత్తు మారియమ్మన్ ఆలయం ఉంది. మారుతీ నగర దర్గా సమీ పంలో ఉన్న ఈ ఆలయంలో ప్రత్యేక అన్నదానం చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, సామాజిక కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆరసనట్టి, మరోళీనగర్, చిన్న ఎలసగిరి, సున్నంబు జీబి, అన్నామలై నగర్, కృష్ణానగర్ పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ప్రమాదాలకు కారణమవుతున్న పశువులు

హోసూరు అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని ప్రధాన రహదారులపై పెద్ద సంఖ్యలో గేదెలు, ఆవులు సంచరిస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. దీని నివారణకు తగిన చర్యలు తీసుకో వాలని వాహనదారులు ప్రజలు కోరుతు న్నారు. పశువుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హోసూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్దసంఖ్యలో పశువులు రోడ్లపై తిరుగుతూ మార్గమధ్యలో విశ్రాంతి తీసు కుంటున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరి ష్కరించాలని వాహ నదారులు, ప్రజలు కోరుతున్నారు.



ప్రధాన రహదారిపై సంచరిస్తున్న ఆవులు

యూబీడీటీ కార్యకర్తల అరెస్టు దారుణం

బళ్లారి సిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో పెంచిన ఫీజులను వెనక్కి తీసుకోవాలని, యూబీడీటీని కాపాడాలని ఏఐడీఎస్‌ఓ పోరాట సమితి సహా పలు ప్రగతిశీల సంస్థలు బుధ వారం దావణగెరె బంద్‌కు పిలుపునిచ్చాయి. ఇందులోభాగంగా దావణగెరె కేఎస్‌ఆర్‌టీసీ బస్‌స్టాండ్ ఎదుట నిరసనకు దిగిన యూబీడీటీ విద్యార్థి పోరాట కమిటీ రాష్ట్ర కార్యదర్శి సభ్యులను శశికళ, ఏఐడీఎ స్‌ఓ జిల్లా కార్యదర్శి సుమన్‌తో పాటు పలువురిని అరెస్టు చేశారు. రాష్ట్రప్రభుత్వ చర్య దారుణమ న్నారు.ధర్నాలు పోరాట హక్కుపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దాడి అన్నారు. జిల్లా కార్యదర్శి కంబాలి మంజునాథ్ మాట్లాడుతూ అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ఆందోళన

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రస్థాయి పోరాట సమితి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం నగరంలో జిల్లా సమితి, మాదిగ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ధర్నాకు నేతృత్వం వహించిన సమితి నాయకుడు హెచ్.హనుమంతప్ప మాట్లాడుతూ దళిత జాతులు విద్యావరంగా, సామాజిక, ఆర్థికంగా అత్యంత వెనుకబడ్డారన్నారు. ఎస్సీ ఎస్టీల వర్గీకరణ రాజ్యాంగ అధికారాన్ని ఆయా రాష్ట్రాలకు ఉందని సర్వోత్తమ న్యాయస్థానం రాజ్యాంగ పూర్తి పీఠం ఆగస్టు 1న తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్సీ జాతులు సామాజికంగా ఏకరూపంగా లేవంటూ న్యాయమూర్తుల రాజ్యాంగ పీఠం పేర్కొందన్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలో 6:1 బలంతో 565 పేజీలు తీర్పు వెలువరిస్తూ రాజ్యాంగంలోని సెక్షన్ 15(4), 16(4) నిబంధనల కింద ఉన్న అధికారాన్ని ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు ఉన్నాయంటూ సీజేఐ తీర్పులో పేర్కొందని వివరించారు. సుప్రీం కోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లాకేంద్రాల్లో బుధవారం జిల్లా కార్యాలయాల ముందు ఆందోళన చేయడం ద్వారా జిల్లాధికారి ద్వారా రాష్ట్ర గవర్నర్‌కు, రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశారు.



నిరసనలో పాల్గొన్న ఎస్సీ జిల్లా సంఘం సమితి పదాధికారులు, ప్రముఖులు